

హస్తవాసి మారుతుందా ?

పీసీసీ చీఫ్‌గా షర్మిల నియామకం తర్వాత కాంగ్రెస్‌లో కాస్త ఊపొచ్చింది. పాత తరంతోపాటు కొత్త తరం జత కలవడంతో ఇటు అధికార వైసీపీలో అలజడి నెలకొంది. నియోజకవర్గాల వారీగా ఓట్ల చీలిక వైసీపీకే ఎక్కువ నష్టం కలిగించేలా ఉన్నాయంటూ విశ్లేషణలు వస్తున్నాయి. మరోవైపు రాబోయే ఎన్నికల్లో పోటీ చేసే ఆశావహులకు ఇప్పటికే పీసీసీ దరఖాస్తులను ఆహ్వానించింది. టికెట్ల కోసం ఎవరెవరు క్యూలో వున్నారనే ఆసక్తి ఆ పార్టీలో కనిపిస్తోంది.

- ఏకమవుతున్న పాత, కొత్తతరాలు.. పోటీకి వీలుగా ఆశావహుల జోరు
- ఎమ్మెల్యే స్థానాలకే ఎక్కువ మొగ్గు.. వచ్చే ఎన్నికలకు రంగం సిద్ధం
- కాంగ్రెస్‌లో షర్మిల జోష్.. నేడు పోతునూరులో కాంగ్రెస్ సభ

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల నుంచి పోటీ చేయదలచిన ఆశావహుల నుంచి కాంగ్రెస్ దరఖాస్తులను ఆహ్వానించింది. దీనికి అనుగుణంగా సామాజికంగా, ఆర్థికంగా కాస్త బలమున్న నేతలతోపాటు ఆది నుంచి కాంగ్రెస్‌ను నమ్ముకున్న నేతలు స్పందించారు. ఈ నెల 10వ తేదీ దరఖాస్తుల స్వీకరణకు తుది గడువు కావడంతో ఉత్సాహవంతులంతా ఇప్పటికే రంగంలోకి దిగారు. పార్లమెంటరీ నియోజకవర్గాలకు ఆశావహుల కొరతవున్నా రానున్న రోజుల్లో కాంగ్రెస్ కొన్ని రాజకీయపక్షాలతో పొత్తులకు దిగబోతున్నట్టు చెబుతున్నారు. దీని దృష్ట్యా అసెంబ్లీ స్థానాలకు పెద్దఎత్తున దరఖాస్తులు వస్తున్నట్టు సమాచారం. వైసీపీ రాజకీయాలతో విసిగిపోయిన కొందరు కాంగ్రెస్ వైపు తొంగి చూస్తున్నారు. గెలుపోటములు పక్కనబెడితే కాంగ్రెస్‌లో వున్న స్వేచ్ఛను ప్రస్తావిస్తూ వీరంతా టికెట్ దరఖాస్తులో ముందు వరుసలో వున్నారు. ఉమ్మడి పశ్చిమలో 15 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక్కొక్కచోట మూడు, నాలుగు తగ్గకుండా దరఖాస్తులు వచ్చాయి. ఏలూరు నుంచి పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజనాల రామ్మోహన్‌రావు, దెందులూరు నుంచి డీవీఆర్ చౌదరి, ఆలపాటి నరసింహమూర్తి, ఉంగుటూరు నుంచి హరికుమార్ రాజు వంటి వారంతా టిక్కెట్ క్యూలో వున్నారు. నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గంలోనూ కాంగ్రెస్ ఆశించినట్టుగానే దరఖాస్తులు అందాయి. నరసాపురం, ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ కన్వీనర్లు జెట్టి గురునాథరావు, కనుమూరి బాపిరాజు మాత్రం ఇప్పటి వరకు ఏ స్థానం నుంచి పోటీకి వీలుగా దరఖాస్తు చేయలేదు.

పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల రంగంలోకి దిగిన తర్వాత పార్టీలో చురుకుదనం పెంచేందుకు ఇప్పటికే ఏలూరు జిల్లాలో పర్యటించారు. రెండో దఫా గురువారం దెందులూరు మండలం పోతునూరులో జరిగే బహిరంగ సభకు హాజరు కాబోతున్నారు. సాయంత్రం ఐదు గంటలకు కొవ్వలి మీదుగా దోసపాడు, ఉండ్రాజవరం అడ్డరోడ్డు, పోతునూరుకు చేరుకుని బహిరంగ సభలో పాల్గొని మాట్లాడతారు. ఈ తరుణంలో పార్టీ సీనియర్లంతా ఆమె వెన్నంటే నడుస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఒకవైపు రాజశేఖరరెడ్డి అభిమానులు, ఇంకోవైపు కాంగ్రెస్ వీరాభిమానులు ప్రత్యక్ష రాజకీయాల్లో అదీ షర్మిల వేగం చూసిన తర్వాత వచ్చిన వారే ఎక్కువగా కనిపిస్తున్నారు. ప్రత్యేకించి ఇప్పటి వరకు ఉన్న రాజకీయాల్లో వెగటు పుట్టి, అసంతృప్తి చెందిన వారు క్రమేపీ కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడే సరికి కాంగ్రెస్‌లో మరింతగా ఊపు కనిపించబోతున్నట్టు పార్టీ నేతలు ఆశతో ఉన్నారు. ఇప్పటికే నియోజకవర్గాల్లో కదలిక కనిపిస్తున్నందున ఇది మరింత పెరిగితే ఏ పార్టీ ఓటు బ్యాంక్‌కు గండి పడబోతున్నదనే అంచనాల్లో కొందరు మునిగి తేలుతున్నారు. ప్రత్యక్షంగా వైసీపీకి ఎక్కువ నష్టంగా జరిగే అవకాశం వుంది. గత ఎన్నికలలో పార్టీకి దిశా నిర్దేశం చేసేవారే లేకపోయినా, దాదాపు అన్ని నియోజకవర్గాలోను పోటీకి దిగడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ఇప్పుడు రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్న తరుణంలో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం మరింత నింపేలా పీసీసీ చీఫ్ షర్మిల ప్రయత్నిస్తున్నారు. గోదావరి జిల్లాల్లో సాధ్యమైనంత మేర వైసీపీని పూర్తిగా ఎండగట్టడం ఆ స్థానంలో కాంగ్రెస్ ఓటు బ్యాంక్ పెరిగేలా చేయాలన్నదే ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కాంగ్రెస్‌కు ఊపు తెచ్చేలా ఇప్పటికే సీనియర్లు తమకు తోచినట్టుగా సలహాలిస్తున్నారు.

ఒకప్పుడు రిజర్వుడు సీట్లలో హవా

ప్రత్యేకించి రిజర్వుడు నియోజకవర్గాల్లో మిగతా నియోజకవర్గాలకంటే గడిచిన ఎన్నికల్లోనే అత్యధిక ఓట్లను అక్కడ పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులు దక్కించుకోగలిగారు. పోలవరం(ఎస్టీ) రిజర్వుడు నియోజకవర్గంలో 2019 ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థికి 6 వేల 647 ఓట్లతో 3.12 శాతం మేర ఓట్లను రాబట్టుకున్నారు. ఒకవైపు వైసీపీ అనుకూల గాలి బలంగా వీచిన తరుణంలో గిరిపుత్రులు కాంగ్రెస్ వెంటే ఉండడం విశేషం. దీనికితోడు చింతలపూడి (ఎస్సీ) రిజర్వుడు నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థికి 3 వేల 640 ఓట్లతో 1.68 శాతం మేర ఓట్లు దక్కించుకోగలిగారు. వాస్తవానికి ఇంతకుముందు కాంగ్రెస్ పక్షాన నిలిచిన అనేకమంది ఆ తర్వాత వైసీపీలోకి మారారు. కాంగ్రెస్‌వాదులు ప్రత్యేకించి రాజశేఖర రెడ్డి వారసుడిగా జగన్‌ను గుర్తించి ఆ మేరకు ముందుకెళ్లారు. ఇప్పుడు దానిని షర్మిల బ్రేక్ చేయాలని భావిస్తున్నారు. ఇంతకుముందు జరిగిన ఎన్నికల్లో కొవ్వూరు, ఆచంట, పాలకొల్లు, ఉండి, తణుకు, ఉంగుటూరు, దెందులూరు, ఏలూరు, గోపాలపురం వంటి నియోజకవర్గాలన్నిటిలోనూ నాలుగంకెల ఓట్లు మాత్రమే కాంగ్రెస్‌కు దక్కాయి.

ఈ పరిస్థితుల నేపథ్యంలో కొద్ది మాసాల వ్యవధిలోనే సార్వత్రిక ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. ప్రత్యేకించి కాంగ్రెస్‌లో గత వైభవాన్ని తీసుకొచ్చేలా షర్మిల నాయకత్వాన పార్టీ పూర్తిగా నిలదొక్కు కోగలదన్న భావనలో పార్టీ సీనియర్లు ఉన్నారు. మారిన రాజకీయ పరిణామాలు ఇంకోవైపు ఎత్తులు, పొత్తులు నడుమ కాంగ్రెస్ ప్రయాణం చేయాల్సి ఉంది.

చేరికలుంటాయా.. ?

కాంగ్రెస్‌లో చేరి ఆ మేర ఈసారి జరగబోయే ఎన్నిక ల్లో పోటీ చేసేందుకు అనుగుణంగా కొందరు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రాష్ట్రంలో వైసీపీని బలంగా కాంగ్రెస్ ఢీకొంటున్న నేపథ్యంలో కొత్తముఖాల చేరిక భారీగా ఉంటుందని కొందరు అంచనా వేశారు. ఏలూరులో జరిగిన కాంగ్రెస్ సభలో ఈ తరహా చేరికలు ఉంటాయని ఆశించినా అప్పుడది సాధ్యం కాలేదు. ప్రస్తుతం రాజకీయం వేడెక్కిన తరుణంలో బీజేపీ, వైసీపీ పార్టీలకు చెందిన కొందరు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. పోతునూరులో గురువారం జరిగే షర్మిల సభకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు.



పోలీసులు అడ్డుకోవడంతో రోడ్డుపై నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

ఆశాలపై జులుం..

- విజయవాడ ధర్నాకు వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులు
- అడుగడుగునా ఆంక్షలు.. గృహ నిర్బంధాలు, నోటీసులు అరెస్టులు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 7: ఆశా వర్కర్లపై పోలీసులు జులుం ప్రదర్శించారు. విజయవాడలో గురువారం జరిగే మహాధర్నాకు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. యూనియన్ నాయకురాళ్ళను గృహ నిర్బంధాలు, అరెస్టులు చేశారు. విజయవాడ మహాధర్నాకు తరలివెళ్లాలని సీఐటీయూ కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలుపుతున్న ఆశాలను పోలీసులు అడ్డుకున్నారు. ప్రభుత్వం, పోలీసులు ఎన్ని అడ్డంకులు సృష్టించిన మహాధర్నా విజయవంతం చేసి తీరుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ తెలిపారు. కరోనా సమయంలో తమ ప్రాణాలు పణంగా పెట్టి ఆశాలు విశేషమైన సేవలందించారని అయినప్పటికి ప్రభుత్వం వారికి ఎటువంటి పరిహారం అందించలేదన్నారు. కేసులు తీసుకొచ్చే సమయంలో ఇవ్వాల్సిన టీఏ బిల్లులు ఇవ్వడం లేదని ఆశావర్కర్ల యూనియన్ లీడర్ విజయలక్ష్మి అన్నారు. ఆశాల అక్రమ అరెస్టులు నిలిపివేయాలని, ప్రజాస్వామ్య బద్ధంగా నిరసన తెలిపే హక్కును అడ్డుకోవడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన ఆశాల సమస్యలు పరిష్కరించకపోతే ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని యూనియన్ నాయకులు సోమయ్య హెచ్చరించారు. ఎం.నాగమణి, ఎస్.రమణారావు, చెల్లమ్మ, వీజేఎస్ కుమారి, ఎస్.రాంబాబు, సూర్యారావు, హనుమాన్, సుజాత పాల్గొన్నారు.



ఆశా వర్కర్లకు నోటీస్ ఇస్తున్న కానిస్టేబుల్

డిమాండ్లు ఇవీ..

- కనీస వేతనం చెల్లించాలి
- కమ్యూనిటీ హెల్త్‌వర్కర్స్‌ని ఆశాలుగా మార్చు చేయాలి
- ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు, మెటర్నటీ లీవులు అమలు చేయాలి
- రూ.10లక్షల గ్రూపు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలి
- మరణించిన వారికి మట్టిఖర్చులు చెల్లించాలి
- రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇవ్వాలి
- 62 సంవత్సరాలకు రిటైర్‌మెంట్ వర్తింప చేయాలి
- మరణించిన, రిటైర్అయిన కుటుంబాల్లో అర్హులైన వారికి ఆశాలుగా తీసుకోవాలి.
- ప్రభుత్వ సంక్షేమపథకాలు అమలు చేయాలి
- కొవిడ్ కాలంలో మరణించిన ఆశాలకు రూ.10లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- ఏఎన్ఎం శిక్షణ ఇవ్వాలి. ఖాళీపోస్టులు భర్తీ చేయాలి

అరకొర వేతనాలు..

ఆశాలు తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించమంటే ప్రభుత్వం పోలీసులతో అణచివేసే ధోరణి ప్రదర్శించడం పట్ల తీవ్ర ఆవేదన చెందుతున్నారు. రాత్రనక, పగలనక ప్రజలకు, గర్భిణులు, తల్లీపిల్లలకు సేవలందిస్తుంటే అరకొర వేతనాలు ఇస్తూ పనిభారం పెంచుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరకొరగా రూ.10వేలు వేతనాలు ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకుంటోందని, వచ్చే వేతనాల్లో రూ.2500 పుస్తకాలు, రికార్డులు కొనడానికే సరిపోతున్నాయని వాపోతున్నారు.

టీడీపీ ఓట్ల గల్లంతు

- వడపట్లలో ఆరు ఓట్ల తొలగింపు
- ఆస్థానే పక్క ప్రాంతీయుల ఓట్ల చేరిక
- కేంద్ర ఎన్నికల కమిషన్‌కు టీడీపీ ఫిర్యాదు

ఏలూరు, ఫిబ్రవరి 7(ఆంధ్రజ్యోతి):అధికార పార్టీ నాయకులు, ఎన్నికల అధికారులు కుమ్మక్కై తమ పార్టీ సానుభూతి పరుల ఓట్లను తొలగిస్తున్నారని టీడీపీ ఆరోపించింది. ఉంగుటూరు నియోజకవర్గంలోని భీమడోలు మండలం వడపట్లలోని బూత్ నెం. 83లో టీడీపీ సానుభూతిపరులైన ఆరుగురి ఓట్లను ఉద్దేశపూర్వకంగా తొలగించారంటూ టీడీపీ జాతీయ పార్టీ కార్యాలయం నుంచి కేంద్ర ఎన్నికల కమిషన్‌కు చెందిన చీఫ్ ఎలక్ట్రోరల్ అధికారికి బుధవారం ఫిర్యాదు చేసింది. జిల్లా ఎలక్ట్రోరల్ అధికారులు ఇటీవల విడుదల చేసిన జాబితా ప్రకారం 469, 472, 474 నుంచి 477 వరకు సీరియల్ నెంబర్లుగా ఉన్న ఓటర్లను అధికారులు తొలగించినట్టు టీడీపీ స్థానిక కో-ఆర్డినేటర్లు గుర్తించారు. ఆ తొలగించిన సీరియల్ నెంబర్లలో ఏలూరు నగరానికి చెందిన 433 నుంచి 437 వరకు సీరియల్ నెంబర్లు కలిగిన ఓటర్లను నమోదు చేశారని, సీరియల్ నెంబర్లు 63, 65లలో రమాదేవి ఉకుర్తి అనే మహిళ ఓటు డబుల్ ఎంట్రీగా నమోదైందని ఫిర్యాదులో పేర్కొంది. సరైన గుర్తింపు కార్డులు లేకుండానే 724, 754, 755, 758, 762, 764 నెంబర్లుగా గుర్తిస్తూ ఓటరు జాబితాలో అర్హత కల్పించడంతో పాటు, 766, 768 నెంబర్లను ఎలాంటి అర్హత గుర్తింపులు చూపించక పోయినా ఓటర్లుగా నమోదు చేయడాన్ని టీడీపీ ప్రశ్నించింది. ఈ విషయాలను పూర్తిస్థాయిలో పరిశీలించాక, తప్పులు జరిగిన మాట వాస్తవమేనని నిర్ధారించుకున్న జాతీయ పార్టీ కార్యాలయం తరపున టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు మొహమ్మద్ అహ్మద్ షరీఫ్ ఫిర్యాదు లేఖను కేంద్ర ఎన్నికల కమిషన్ కార్యాలయానికి పంపించారు. తక్షణమే ఆయా ఓటరు జాబితాలోని తొలగింపులు, అక్రమ చేర్పులు, అనర్హులను తొలగించే విధంగా కలెక్టర్‌తో పాటు జిల్లా ఈఆర్వో, ఏఈఆర్వోలకు సూచనలు చేయాలని కోరారు.

ఓటర్ల జాబితాపై కలెక్టర్ సమీక్ష

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 7: అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఫారం-7 కి దరఖాస్తులు 0.1 శాతం కన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్లను తొలగించాలంటే రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి అనుమతి తప్పనిసరి అని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ పేర్కొన్నారు. జిల్లా ఓటర్ల జాబితాలోని అంశాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో బుధవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 'నియోజకవర్గ పరిధిలో ఫారం- 7కి దరఖాస్తులు 0.1 శాతం లోపు ఉంటే వాటిని పరిశీలించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేశాం. కమిటీ పరిశీలన అనంతరం ఆ ఓట్ల తొలగింపునకు జిల్లా ఎన్నికల అధికారిగా చర్యలు తీసుకుంటా. అదే 0.1 శాతం కన్నా ఎక్కువ వస్తే ఆ ఓట్లను తొలగించాలంటే రాష్ట్ర స్థాయిలో కమిటీ పరిశీలించి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి సమర్పిస్తాం. చింతలపూడి, ఏలూరు, కైకలూరు నియోజకవర్గాలలో 0.1 శాతం కన్నా ఎక్కువ తొల గింపునకు దరఖాస్తులు వచ్చాయి. జనవరి 23 వ తేదీ నుంచి ఇంతవరకు అందిన దరఖాస్తుల్లో 14, 261 దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. వీటన్నింటినీ పది రోజుల్లో పరిష్కరించి సప్లిమెంటరీ ఓటర్ల జాబితాలో చేర్చుతాం.'..అన్నారు. డీఆర్వో డి. పుష్పమణి, కలెక్టరేట్ ఏవో రమాదేవి, నెరుసు నెలరాజు (బీజేపీ), పి.ఆదిశేషు (సీపీఎం), ఎస్.బాబూ ప్రసాద్ (కాంగ్రెస్), పాలి ప్రసాద్ (టీడీపీ), తదితరులు హాజరయ్యారు.

ఇక వైసీపీ ఇంటికే..

- రా.. కదలిరా చింతలపూడి సభ విజయవంతం : టీడీపీ, జనసేన నాయకుల కృతజ్ఞతలు

చింతలపూడి, ఫిబ్రవరి 7 : 'ప్రజల్లో మార్పు వచ్చింది. చింతలపూడిలో చంద్రబాబు నిర్వహించిన రా.. కదలిరా బహిరంగ సభ విజయవంత మైంది. ఇక వైసీపీని ఇంటికి పంపడమే మిగిలి ఉంది' అని టీడీపీ నాయ కులు స్పష్టం చేశారు. బుధవారం ఇక్కడ ఏర్పాటు చేసిన సమావేశంలో సభను విజయవంతం చేసిన టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో టీడీపీ నాయకులు కోళ్ళ నాగేశ్వరరావు, జె.ముత్తారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, గోరుముచ్చు గోపాల్‌యాదవ్, బొమ్మాజీ అనిల్, సొంగా రోషన్‌కుమార్, ఆకుమర్తి రామారావు తదితరులు మాట్లాడారు. ఈ సభ ద్వారా పోలవరం ప్రాజెక్టు, చింతలపూడి ఎత్తిపోతలు పూర్తి కావాలంటే అది చంద్రబాబు వల్లే సాధ్యమని ప్రజలు బలంగా విశ్వసిస్తున్నట్టు తెలిపారు. సభలో మీడియా ప్రతినిధులకు జరిగిన అసౌకర్యానికి చింతిస్తున్నామని, ఇకపై ఇటువంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. దాసరి శ్యాం చంద్రశేషు, మాటూరి వెంకట్రామయ్య, రాపూరి కృష్ణ, జనసేన నాయకుడు టి.నాగవిజయకుమార్, నియోజకవర్గ ప్రముఖులు తరలివచ్చారు.



చింతలపూడి టీడీపీ సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు



డ్రోన్ రీసర్వేతో.. కొత్త చిక్కులు..!

- హద్దులు కోల్పోయిన ఆక్వా భూములు
- జాయింట్ ఎల్‌పీఎంలతో ఇబ్బందులు
- భూముల రిజిస్ట్రేషన్ బంద్..

ముదినేపల్లి, ఫిబ్రవరి 7 : భూముల రీ సర్వే ప్రక్రియ రైతులకు కొత్త కష్టాలు తెచ్చి పెట్టింది. ప్రభుత్వం డ్రోన్లతో రీ సర్వే నిర్వహించడంతో అంతకు ముందున్న భూములు హద్దులే మారిపోయాయి. పాత రీ సర్వేలో నెలకొన్న ఇబ్బందులు తొలగి వివాదాలు లేని విధంగా భూముల రికార్డులు రూపొందుతాయని ప్రభుత్వం ప్రకటించినా ఆచరణలో అందుకు విరుద్ధంగా డ్రోన్ల సర్వే జరిగింది. రీ సర్వే అనంతరం జాయింట్ ల్యాండ్ పార్శిల్ మెంబరు (ఎల్‌పీఎం)లు ఏర్పడ్డాయి. భూములు, చేపల చెరువుల గట్లు ఆధారంగా డ్రోన్లు రీ సర్వే చేయడంతో ఎల్‌పీఎంలు ఉమ్మడిగా నమోదయ్యాయి. దీంతో రైతులు వ్యక్తిగతంగా తమ భూముల గుర్తింపును కోల్పోయారు. సరిహద్దులు మారిపోయాయి. భూముల కొనుగోళ్లు, అమ్మకాలను, భూముల తనఖా రిజిస్ట్రేషన్లకు, బ్యాంకుల నుంచి రుణాలు పొందేందుకు అవకాశం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కైకలూరు నియోజకవర్గంలో రీ సర్వే జరిగిన గ్రామాల్లో నెలకొన్న ఇబ్బందులివి. చిన్న, సన్న కారు రైతులు పది మంది కలిపి ఉమ్మడిగా తవ్వుకున్న చేపల చెరువులకు, ఉమ్మడి కుటుంబ భూములకు రీ సర్వేలో ఎల్‌పీఎం నెంబరు జాయింట్‌గా నమోదైంది. నాలుగు వైపులా ఉన్న గట్ల మధ్య ఉన్న చెరువును ఒకే ల్యాండ్ పార్శిల్‌గా తీసుకుని ఒకే ఎల్‌పీఎం నెంబరును డ్రోన్ సాంకేతిక సిస్టమ్‌లో నమోదైంది. దీంతో ఆ చెరువులో భూములు కలిగి ఉన్న పాత ఆర్ఎస్ నెంబర్లు, వెబ్ ల్యాండ్ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తే అతని పాత ఆర్ఎస్ నెంబర్ రాకుండా ప్రస్తుత రీ సర్వే జాయింట్ ఎల్‌పీఎం నెంబరు వస్తోంది. అంతేకాక ఏ రైతు పేరు ఎంటర్ చేసినా మొత్తం భూమి విస్తీర్ణం ఆన్‌లైన్‌లో కనిపిస్తోంది. ఏ రైతు పేరున ఎంత వాస్తవ విస్తీర్ణం ఉందో తెలియడం లేదు. వరి భూముల పరిస్థితి అంతే.

- రీ సర్వే వల్ల జాయింట్ ఎల్‌పీఎం నెంబర్లు కొత్తగా నమోదు కావడంతో భూముల అమ్మకాలకు, భూములపై రుణాలు తీసుకునేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. వెబ్ ల్యాండ్‌లో రైతు వ్యక్తిగత భూముల పాత సర్వే నెంబర్లు వస్తున్నప్పటికీ ఎల్‌పీఎం నెంబర్లు జాయింట్‌గా వస్తుండడంతో సంబంధిత రైతు తన భూమిని అమ్ముకునేందుకు వెబ్ ల్యాండ్ మ్యాపింగ్‌లో గుర్తించే అవకాశం లేక తనఖా రిజిస్ట్రేషన్‌కు, సేల్ డీడ్‌కు ఇబ్బందులు ఏర్పడ్డాయి.
- డ్రోన్ సహాయంతో భూముల రీ సర్వేలో జాయింట్ ఎల్‌పీఎంలు నమోదైన రైతులు తమ భూములకు వ్యక్తిగత ఎల్‌పీఎం నెంబరు పొందేందుకు ఆన్‌లైన్‌లో అర్జీలు దాఖలు చేసుకోవాలంట. తన భూమిని గుర్తింపు పొందేందుకు పలానా సరిహద్దుల మధ్య ఆర్ఎస్ నెంబర్ పట్టా నెంబరుతో సహా తిరిగి సర్వేకు అర్జీ చేసుకోవాలని రెవెన్యూ అధికారులు చెబుతు న్నారు. ఆ భూములను మండల సర్వేయర్, గ్రామ సచివాలయ సర్వేయర్లు సర్వే చేసి సంబంధిత రైతు భూమికి కొత్తగా ఎల్‌పీఎం నెంబర్ ఇస్తారు. ఇదొక దీర్ఘకాలిక ప్రక్రియని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తు న్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యే వరకు తమ అవసరాలను తీర్చుకునేందుకు భూముల అమ్మకాలు, రుణాలు తీసుకోవడం ఎలాగని రైతులు ప్రశ్నిస్తున్నారు.

రైతులకు ఒరిగిందేమీ లేదు..



శాసనసభలో ఆర్థిక మంత్రి రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ప్రవేశపెట్టిన ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్‌లో రైతులకు, కౌలు రైతులకు ఒరిగిం దేమీ లేదు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి నిధుల కేటాయింపు ప్రస్తావన లేకపోవడం దారుణం. ధరల స్థిరీకరణ నిధికి ఎటువంటి కేటాయింపులు లేవు. ఉద్యాన పంటలకు ప్రోత్సహక నిధులు నామమాత్రమే. పాడి రైతు లకు లీటరుకు రూ.4 ప్రోత్సాహకం ఇస్తానన్న ప్రభుత్వం కేటాయింపులు మరిచింది. వ్యవసాయ రంగానికి, రైతు సంక్షేమానికి, సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు పెంచాలి.

\- కె.శ్రీనివాస్, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఇది ఎన్నికల బడ్జెట్



ఇది ఎన్నికల బడ్జెట్. ఏ వర్గానికి సరైన కేటాయింపులు లేవు. ఉద్యోగుల సమ్మెలో జీతాలు పెంచుతామని హామీ ఇచ్చారు. వాటికి కేటాయింపులు లేవు. వ్యవసాయ పంటల ధరల స్థిరీకరణ నిధికి రూ.3వేల కోట్లు కేటాయిస్తామన్నచ హామీకి బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. జగనన్న 30 లక్షల ఇళ్ల నిర్మాణానికి కేటాయింపులు ఎక్కడ. డ్వాక్రా మహిళల రుణాల రద్దుకు కేటాయింపులు లేవు. పోలవరం ఊసేలేదు. బడ్జెట్‌లో జిల్లాకు ఒరిగిందేమి లేదు.

\- ఎ.రవి, సీపీఎం జిల్లా కార్యదర్శి

\- ఏలూరు టూటౌన్

లింగపాలెం గ్రామ కార్యదర్శి సస్పెన్షన్

లింగపాలెం, ఫిబ్రవరి 7: లింగపాలెం గ్రామ పంచాయతీ కార్యదర్శి సుగుణ రాజును సస్పెండ్ చేసినట్టు ఎంపీడీవో రాంబాబు తెలిపారు. గతంలో ఆయన ధర్మాజీగూడెం గ్రామ కార్యదర్శిగా పనిచేస్తున్న సమయంలో రూ.1.40 లక్షలు నిధులు దుర్వినియోగం చేసినట్టు అభియోగాలు వచ్చాయి. కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశాల మేరకు విచా రణ చేయగా వాస్తవమని తేలడంతో సస్పెండ్ చేస్తూ డీపీవో తూతిక విశ్వనాథ శ్రీనివాస్ ఉత్తర్వులు ఇచ్చారు.

306 టీచర్ పోస్టుల భర్తీ

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7:డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌కు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో మొత్తం 306 ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనున్నారు. ఇవి పాఠశాల విద్యా శాఖ పరిధిలోని మునిసిపల్, గవర్నమెంట్, జడ్పీ, మునిసిపల్ కార్పొరేషన్ యాజమాన్యాల పాఠశాలలతోపాటు, ఇతర యాజమాన్యాలైన ఏపీ ట్రైబల్ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ఏపీ రెసిడెన్షియల్, మోడల్ స్కూల్స్‌లో ఉన్నాయి. ఆ ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్(ఎస్జీటీ) కేడర్‌లో 102 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో 145, టీజీటీ 59 పోస్టులు నోటిఫికేషన్‌లో ప్రకటిస్తారు. స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో భర్తీ చేసే 145 పోస్టులు పాఠశాల విద్య పరిధిలోని జడ్పీ, ప్రభుత్వ, మున్సిపల్ యాజమాన్యంలోనే ఉంటాయి. ఆ ప్రకారం బయోలాజికల్ సైన్స్ 4, ఇంగ్లీషు 7, హిందీ 41, గణితం 4, వ్యాయామ విద్య 53, ఫిజికల్ సైన్స్ 4, సంస్కృతం 3, సోషల్ స్టడీస్ 3, స్పెషల్ ఎడ్యుకేషన్ 6, తెలుగు 20 పోస్టులను భర్తీ చేయనుండగా, ఎస్జీటీ పోస్టులు అవసరానికి మించి ఉన్నందున పాఠశాల విద్యా శాఖలో భర్తీ చేయడం లేదు. మిగతా యాజమాన్యాల నుంచి భర్తీచేసే పోస్టుల సంఖ్యపై స్పష్టత రావాల్సి ఉంది.

పది పరీక్షలకే తొలిప్రాధాన్యం : డీఈవో అబ్రహం



డీఈవోకు అధికారుల శుభాకాంక్షలు

పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించి అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించడమే తన ముందున్న అంశమని డీఈవో ఎస్.అబ్రహం వెల్లడించారు. రాజమండ్రి నుంచి ఏలూరు జిల్లాకు బదిలీపై వచ్చిన ఆయన బుధవారం విధుల్లో చేరారు. గతేడాది కంటే మెరుగైన ఫలితాలు వచ్చేలా కృషి చేయాలని తన శాఖ అధికారులతో సమావేశంలో కోరారు.

నేటి నుంచే డీఎస్సీ ఉపాధ్యాయ నియామక ప్రక్రియ

డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్ ప్రక్రియ గురువారం ప్రారంభమవుతుందని డీఈవో వివరించారు. ఉపాధ్యాయ అర్హతా పరీక్ష(టెట్), ఆ తర్వాత డీఎస్సీ పరీక్షలు ఆన్‌లైన్ విధానంలో కంప్యూటర్ బేస్డ్ టెస్టు (సీబీటీ) పద్ధతిలో జరుగుతాయన్నారు. టెట్‌కు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో ఈ నెల 8 నుంచి 18 వరకు, పరీక్షలు ఈ నెల 27 నుంచి మార్చి 9 వరకు, ఫలితాల ప్రకటన మార్చి 14న ఉంటాయన్నారు. డీఎస్సీ నియామ కాలకు దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్‌లో ఈనెల 12 నుంచి 22 వరకు, పరీక్షలు మార్చి 15 నుంచి 30 వరకు, ఫలితాలు ఏప్రిల్ 7న ప్రకటిస్తారన్నారు.

పోలవరం నిర్మాణంపై కౌంటర్ వేయండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టును నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసేలా ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన వ్యాజ్యంపై హైకోర్టు స్పందించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రతి వాదులుగా ఉన్న కేంద్ర హోం, జలశక్తి శాఖల కార్యదర్శులు, పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) సీఈవో, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఛైర్మన్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి నోటీసులు జారీ చేసింది. విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం బుధవారం ఆదేశాలిచ్చింది. బహుళార్థ సాధక ప్రాజెక్టు పోలవరం నిర్మాణ బాధ్యతను రాష్ట్ర ప్రభుత్వం నుంచి తన అధీనంలోకి తీసుకుని నిర్ణీత గడువులోగా పూర్తిచేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలంటూ అమలాపురానికి చెందిన న్యాయవాది వి.రమేశ్ చంద్రవర్మ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ఎగువ కాఫర్‌డ్యాం నిర్మాణం చేయకుండా డయాఫ్రం వాల్ నిర్మాణానికి అనుమతించిన అధికారులపై విచారణకు ఆదేశించకపోవడాన్ని చట్ట విరుద్ధమైన చర్యగా ప్రకటించాలని కోరారు. పిటిషనర్ తరపున న్యాయవాది మంగెన శ్రీరామారావు వాదనలు వినిపిస్తూ కాఫర్ డ్యాం పూర్తిగా నిర్మించకుండా వదిలేయడంతో వరదల కారణంగా డయాఫ్రం వాల్ దెబ్బతిందని దీంతో రూ.700 కోట్ల ప్రజాధనం వృథా అయిందని తెలిపారు. డయాఫ్రం వాల్‌కు మరమ్మతులు చేసేందుకు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు పూర్తిచేయకుంటే ప్రజలకు నష్టం జరు గుతుందని తెలిపారు. కేంద్రప్రభుత్వ న్యాయవాది జూపూడి యజ్ఞదత్ వాదనలు వినిపిస్తూ పోలవరం జాతీయ ప్రాజెక్టు అని కేంద్రం ఇచ్చే నిధులతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు.ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది.

వైద్య ఉద్యోగాల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 : జోన్-2పరిధి జిల్లాల్లో కొత్తగా మంజూరైన రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం ప్రభుత్వ వైద్యకళాశాలలు, కాకినాడ రంగరాయ వైద్యకళాశాల్లో నాలుగు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు, వివిధ పీహెచ్‌సీల్లో 20 గ్రేడ్-2 ఫార్మసిస్టు పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీచేసినట్టు ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.పద్మా శశిధర్ ఓ ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ వివరాలను, దరఖాస్తును ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల అధికారిక వెబ్‌సైట్లలో పొందుపర్చామన్నారు. దరఖాస్తుకు సంబంధిత ధ్రువీకరణ పత్రాలను జతచేసి ఈ నెల 8 నుంచి 20వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలోని ఆర్డీ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

సమగ్రశిక్ష ఏపీసీ పోస్టుకోసం శ్యాంసుందర్ యత్నాలు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 : రెగ్యులర్ డీఈవో నియామకంతో ఇన్‌చార్జి విధుల నుంచి వైదొలగిన పి.శ్యాంసుందర్ ప్రత్యామ్నాయ పోస్టుకోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందులో భాగంగా ఇన్‌చార్జి డీఈవో బాధ్యతలకు ముందువున్న పశ్చిమగోదావరి జిల్లా సమగ్రశిక్ష ఏపీసీగా లేదా ఇదే పోస్టులో ఏలూరు జిల్లాలో నియమితులయ్యేందుకు యత్నిస్తున్నట్టు తెలిసింది. కాగా డిప్యూటీ కలెక్టర్ పదోన్నతి పొందిన ఏలూరు తహసీల్దార్ సోమశేఖర్‌ను సమగ్ర శిక్ష ఏలూరు జిల్లా ఏపీసీగా ప్రభుత్వం ఇప్పటికే నియమించినప్పటికీ ఆయన జిల్లాలో బాధ్యతలు చేపట్టేందుకు ఎస్ఎస్ఏ రాష్ట్ర కార్యాలయం నుంచి ఇంతవరకు ఉత్తర్వులు జారీకాలేదు. జిల్లాల పునర్విభజనలో ఎస్ఎస్ఏ ఏపీసీ పోస్టు భీమవరం కేంద్రంగావున్న పశ్చిమగోదావరి జిల్లాకు వెళ్ళిపోవడంతో ఇపుడు ఏలూరు జిల్లాలో ఏపీసీ పోస్టును చేపట్టినా జీతభత్యాలు చెల్లించడానికి సాంకేతికపరమైన అడ్డంకులు ఉండటమే ఉత్తర్వుల జారీకి డైలమాలో పడినట్టు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో సోమశేఖర్ ఏపీసీ విధులు చేపడతారా లేక శ్యాంసుందర్ నియమితులవుతారా అనే సందిగ్ధత ఏర్పడింది.

మెగా డీఎస్సీ విడుదల చేయాలి : డీవైఎఫ్ఐ

భీమవరం ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7 : రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 6100 డీఎస్సీ పోస్టులు రాష్ట్రంలో సిద్ధమవుతున్న 10 లక్షల మంది అభ్యర్థులకు ఎలా న్యాయం చేస్తారని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి ఎస్‌వీఎన్ శర్మ, గేదెల ధనుష్‌లు అన్నారు. బుధవారం భీమవరంలో వారు మాట్లాడుతూ 25 వేల పోస్టులతో మెగా డీఎస్సీ విడుదల చేయాలని ఈనెల 9న భీమవరం ప్రకాశం చౌక్ వద్ద డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆందోళన చేయనున్నట్టు తెలిపారు. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి రాక మునుపు ఇచ్చిన 23 వేల మెగా డీఎస్సీ హామీకి, ఇప్పుడు విడుదల చేసిన దగా డీఎస్సీకి ఎక్కడా పొంతన లేదన్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో సుమారు 45 వేల మంది డీఎస్సీ కోసం ఎదురుచూస్తుంటే ఉమ్మడి పశ్చిమ గోదావరికి ప్రభుత్వం అతి స్వల్పమైన సంఖ్యను ప్రకటించి చేతులు దులుపుకోవడం దుర్మార్గం అన్నారు. జూన్ నెలలో రిటైర్ అయ్యే ఉద్యోగాలను చేర్చి 25 నుంచి 30 వేల పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, అప్రెంటిస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు.

పాలకొల్లులో ఏఐఎస్ఎఫ్ నిరసన

పాలకొల్లు టౌన్ : మెగా డీఎస్సీ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్.సుందర్, టి.అప్పలస్వామిలు డిమాండ్ చేశారు పాలకొల్లు అద్దేపల్లి సత్యనారాయణ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం నిరసన తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి రాక క్రితం రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను పరిగణలోకి తీసుకుని మెగా డీఎస్‌సీ తీస్తామని చెప్పి ఇప్పుడు కేవలం 6,100 పోస్టులతో డిఎస్‌సి తీయడం నిరుద్యోగ యువతను మోసం చేయడమేనని అన్నారు. తక్షణం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేసి మెగా డీఎస్సీ నిర్వహించాలని లేదంటే రాష్ట్ర వ్యాప్తంగా ఏఐఎస్ఎఫ్ పోరుకు సిద్ధమవుతుందని తెలిపారు. డి.పెద్దిరాజు, కె.నవీన్, ఎన్.కరుణ, జి.ప్రశాంతి,సాయిపవన్ తేజ, ఎం.మణికంఠ పాల్గొన్నారు.

సర్పంచ్‌ల ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కడలి గోపాలరావు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 7: కేంద్ర నిధులను సైతం తన ఖాతాల్లోకి మళ్ళించుకున్న వైసీపీ ప్రభుత్వంపై తమ పోరాటం ఉధృతం చేస్తామని ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీరాజ్ ఛాంబర్ ఉభయ గోదావరి జిల్లా అధ్యక్షుడు కడలి గోపాలరావు పేర్కొన్నారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాటాడారు. మంగళవారం తలపెట్టిన చలో తాడేపల్లి విజయవంతం అయిందని తెలిపారు. 3.5 కోట్ల గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారమయ్యేవరకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. జగన్ ప్రభుత్వం ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీల సర్పంచ్‌లు చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేశారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం పంచాయతీలకు చెల్లించకుండా వాడేసుకున్న 14,15 ఆర్థిక సంఘం నిధులు చెల్లించాలని డిమాండ్ చేశారు. సర్పంచ్‌లకు రూ.15 వేలు, ఎంపీపీ, జడ్పీటీసీలకు రూ.30 వేలు పెంచాలని ఎన్ఆర్ఈజీఎస్ నిధులు పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలకు చెల్లించాలని సర్పంచ్‌ల ఆధ్వర్యంలోనే అభివృద్ధి కార్యక్రమాలు జరిపించి గృహ సారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఉభయ గోదావరి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పాలడుగుల లక్ష్మణరావు, డి.సింధు, బుచ్చిబాబు,బి.శ్రీనివాస్, సి.శ్రీనివాస్, తాడేపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ వినియోగదారులు, రైతులకు అవగాహన సదస్సులు : ఎస్ఈ సాల్మన్‌రాజు

ఏలూరుసిటీ, ఫిబ్రవరి 7: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని అన్ని మండలాల్లోని విద్యుత్ సెక్షన్ కార్యాలయాల వద్ద వ్యవసాయ శాఖ, విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారులు, రైతులకు గురువారం నుంచి అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్‌రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్త వ్యవసాయ, ఇతర విద్యుత్ సర్వీసుల కోసం దరఖాస్తులను ఆయా గ్రామాలకు సంబంధించిన గ్రామ సచివాలయంలో నమోదు చేసుకోవాలి. నిర్ధేశించబడిన ఎస్టిమేట్ చార్జీలకు తప్ప ఇతరులకు ఏ విధమైన సొమ్మును అదనంగా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా సొమ్ములు అడిగితే విద్యుత్ సమస్యల టోల్‌ఫ్రీ నెంబరు 1912 కుగాని, దగ్గరలోని విద్యుత్ అధికారులకు గాని తెలియజేయాలన్నారు.

పులి కదలికలపై అటవీశాఖ బృందాల నిఘా

పోలవరం, ఫిబ్రవరి 7 : పులి కదలికలపై అటవీశాఖ బృందాలతో నిఘా ఏర్పాటు చేసినట్లు అటవీక్షేత్రాధికారి దావీదు రాజు బుధవారం తెలిపారు. నెల రోజులుగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ద్వారకాతిరుమల, బుట్టాయిగూడెం, పోలవరం మండలాల్లో పశువులపై దాడులకు పాల్పడుతూ ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేసిన పులి రెండు రోజుల క్రితం కొవ్వాడలో, ఉడతపల్లిలో పాడి పశువులపై దాడిచేసి చంపిన విషయం తెలిసిందే. పులి పాదముద్రలు కదలికలపై అటవీశాఖ అధికారులు కన్నాపురం రేంజి పరిధిలో రెండు బృందాలు, పోలవరం రేంజ్ పరిధిలో నాలుగు బృందాలుగా ఏర్పడి నిఘా ఉంచినట్టు అటవీశాఖ క్షేత్రాధికారి తెలిపారు. పోలవరం మండలంలో ఉడతపల్లి, మెత్తప్పకోట, సున్నాలగండి, జిల్లెల్లగూడెం, పంచాయతీ పరిధి గ్రామాల్లో పులి సంచారం పట్ల గ్రామ ప్రజలకు అటవీశాఖ సిబ్బంది హెచ్చరికలు చేశారు.

సొంత ఇంటి కలకు మంచిరోజులు

తగ్గిన సిమెంటు.. ఐరన్ ధరలు
అయినా నిర్మాణ రంగం డల్
రియల్ ఎస్టేట్ పడిపోవడమే కారణం



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 7 : ఇల్లు కట్టుకోవాలనుకునేవారికి ఇవి మంచిరోజులే.. సిమెంటు, ఐరెన్ ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. అయితే నిర్మాణాలు పుంజుకోవాల్సింది పోయి రోజురోజుకు తగ్గుతు న్నాయి. దీనికి కారణం రియల్ ఎస్టేట్ వ్యాపారం ఆశాజనకంగా లేకపోవడం, నిర్మాణ రంగంలో ఊతం లేకపోవడమే.సాధారణంగా నిర్మాణాలకు డిసెంబర్ నుంచి జూన్ నెలల్లో అనుకూలంగా ఉండేకాలం. ఈ సమయంలోనే భవణ నిర్మాణాలకు కీలకంగా ఉండే సిమెంట్, ఐరన్ ధరలను పెంచుతారు. కానీ నిర్మాణాలు పెద్దగా లేకపోవడంతో ధరలు పెంచితే ఉన్న కొద్దిపాటి నిర్మా ణాలు కూడా ఆగిపోయి కర్మాగారాల నిర్వహణకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని కంపెనీలు భావిస్తున్నాయి.

సిమెంటు ధర దిగువకు..

గతంలో ఎన్నడూ లేనివిధంగా సిమెంటు ధరలు గరిష్టస్థాయిలో దిగువకు చేరాయి. ప్రస్తుతం సిమెంటు ధరలు రూ.270 నుంచి రూ.310 వరకూ మార్కెట్‌లో విక్రయాలు సాగుతున్నాయి. బ్రాండు, గ్రేడ్ తదితర వ్యత్యా సాలతో వీటి ధరలు నిర్ణయిస్తారు. గతేడాది నవంబర్‌లో ఈ ధరలు రూ.370 వరకూ విక్రయించారు. గతేడాది నవంబర్‌లో గరిష్ఠంగా రూ.370 విక్రయిం చిన ధరలు తెలంగాణ ఎన్నికల ఎఫెక్టుతో కొంత మేర తగ్గగా తరువాత నిర్మాణాలు పుంజుకుంటే ధరలు పెంచవచ్చని భావించిన కంపెనీలకు నిర్మాణ రంగం షాక్ ఇచ్చింది. దీంతో ధరలు మరింత కనిష్ట స్థాయికి పడిపోయాయి.

ఐరెన్‌దీ అదే బాట

గతేడాదిలో టన్ను ఐరెన్ ధర గరిష్ఠంగా రూ.70 వేలు పైగా పలకగా ఈ ఏడాది ఆ ధరలు కనిపించడం లేదు. ప్రస్తుతం ఐరన్ టన్ను ధర రూ.57 వేల నుంచి 60 వేల వరకూ విక్రయాలు జరుగుతున్నాయి. ఈ ఏడాదిలో ఇదే కనిష్ఠ ధర అని నిర్ధారణకు వచ్చిన వ్యాపారులు రెండు నెలల క్రితం టన్ను రూ.62 వేలు పలికిన సందర్భంలో టన్నుల కొద్దీ ఐరెన్ స్టాకు పెట్టిన చాలామంది టన్నుకు రూ.3 వేల వరకూ చేతులు కాల్చుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు చేసే సాహసం చేయడం లేదు. ఈ పరిస్థితి సామాన్యులకు కొంత ఊరటే

ఊగిసలాడుతున్న ఇసుక ధర

గతంలో ఇసుక ధర నిలకడగానే ఉండేది. కానీ ప్రభుత్వం చేస్తున్న మార్పులతో ఇసుక ధర ఊగిసలాడుతోంది. నెల క్రితం మూడు యూనిట్‌ల ఇసుక లారీ రూ.12 వేల వరకూ విక్రయించారు. వారం క్రితం వరకూ అదే ధర కొనసాగినా ప్రస్తుతం ధర తగ్గింది. ఇసుక ర్యాంపులను ప్రైవేటు వ్యక్తు లకు అప్పగించడంతో వాటిపై ప్రభుత్వ నియంత్రణ లేక వినియోగ దారులు విలవిల్లాడుతున్నారు. వీటికితోడు బాటచార్జీల పేరుతో కొత్తరకం బాదుడు మొదలెట్టడం మరింత ఆందోళన చెందుతున్నారు. దీంతో ఇసుక ధరలకు నిలకడ లేదు.


:పవన్‌కుమార్‌ను అభినందిస్తున్న బాడీ బిల్డింగ్ శిక్షకులు

బాడీ బిల్డింగ్‌లో ఛాంపియన్‌గా పవన్‌కుమార్

ఏలూరు స్పోర్ట్స్, ఫిబ్రవరి 7: కేరళ రాష్ట్రం కాలికట్‌లో ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ బాడీ బిల్డింగ్ పోటీల్లో 110 కేజీల విభాగంలో ఏలూరు బాడీ బిల్డర్స్ కె.పవన్‌కుమార్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపి యన్‌గా నిలిచి బంగారు పతకాలు సాధించాడు. ఈనెల 5వ తేదీన జరిగిన పోటీల్లో దేశవ్యాప్తంగా వివిధ జిమ్‌ల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఏలూరు రామ్‌లక్ష్మణ్ జిమ్‌కు చెందిన కె.పవన్‌కుమార్ ఛాంపియన్‌గా నిలిచాడు. ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి సత్యనారాయణ, పలువురు బాడీ బిల్డర్లు పవన్‌కుమార్‌ను అభినందించారు.

లాకర్‌లో బంగారం మాయం

బాధితురాలు లబోదిబో



తణుకు, ఫిబ్రవరి 7: దువ్వ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలోని లాకర్‌లో భద్ర పర్చుకొన్న బంగారు ఆభరణాలు కనిపించక పోవడంతో బాధితురాలు లబోదిబోమంటూ పోలీసులను ఆశ్రయించారు. దువ్వ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యన్నమని ఉమా మహేశ్వరి దువ్వ సహకార సంఘంలో 2012 సంవత్సరంలో రూ. 8 వేలు డిపాజిట్ చెల్లించి సొసైటీలో 23వ నెంబర్ లాకర్ తీసుకున్నారు. ఆ లాకర్‌లో 2018 సంవత్సరంలో 806 గ్రాముల బంగారు గాజులు, నెక్లెస్, వడ్డాణం, హారం వంటివి సుమారు రూ.40 లక్షల విలువైన ఆభరణాలు భద్రపర్చుకున్నారు. ఈనెల 6న బ్యాంకు లాకర్‌లో ఉన్న బంగారు వస్తువులను తీసుకునేందుకు సొసైటీకి వెళ్లినట్లు చెప్పారు. సొసైటీలో మాస్టర్ కీని సొసైటీలో ఉన్న అధికారిక సిబ్బందికి కాకుండా ప్రైవేటుగా పనిచేసే సిబ్బందికి ఇచ్చి అధికారులు పంపించారు. ఉమాదేవి మాస్టర్ కీపెట్టి తీసిన వెంటనే తన వద్ద ఉన్న కీ పెట్టి తిప్పకుండానే లాకర్ ఓపెన్ అయింది. లాకర్‌లో చూసేసరికి ఆభరణాలు కనిపించలేదు. దీంతో సొసైటీ అధికారులకు సమాచారం ఇచ్చారు వెంటనే సొసైటీ అధ్యక్షుడు కృష్ణంరాజు, కార్యదర్శి సూర్యకిరణ్, మాజీ కార్యదర్శి బాబురావులు లాకర్ వద్దకు వచ్చి చూశారు. నిబంధనల ప్రకారం పోయిన బంగారంపై తమకు ఎటువంటి సంబంధం లేదని పోలీసులకు ఫిర్యాదు చేసుకోవాలని సూచిం చారు. దీంతో ఆమె తణుకు రూరల్ పోలీసులకు, సొసైటీ అధికారులకు ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ సొసైటీ లాకర్ పరిశీలించగా లాకర్ ఎలాంటి డ్యామేజీ కాలేదని చెప్పారు. దీనిపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపడతామని తెలిపారు.



శ్రీవారి ఆలయంలో అంబాజీపేట బ్యాండు మూవీ టీం సందడి

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 7: ద్వారకా తిరుమల చినవెంకన్న ఆలయంలో అంబాజీపేట బ్యాండు మూవీ టీం బుధవారం సందడి చేసింది. సినిమా హీరో సుహాస్, హీరోయిన్ శివాని, డైరక్టర్ దుష్యంత్‌తో పాటు టీం సభ్యులు స్వామివారిని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పండితుల నుంచి వేదాశీర్వచనం పొందారు. ఈ చిత్రం రిలీజ్ అయి ఐదురోజులైందని ప్రేక్షకులు ఈ చిత్రాన్ని బాగా ఆదరిస్తున్నట్లు నటుడు సుహాస్ తెలిపారు. స్వామివారి ఆశీస్సుల కోసం ఈ క్షేత్రానికి వచ్చామని ఇక్కడ నుంచి రాజమహేంద్రవరం, కాకినాడ వెళ్తున్నట్లు చెప్పారు.

డాక్టర్ కడిమెళ్ళకు కేవీ రమణ జాతీయ పురస్కారం



నరసాపురం, ఫిబ్రవరి 7: ప్రముఖ సహస్రావధాని డాక్టర్ కడిమెళ్ళ వరప్రసాద్‌కు ప్రతిష్ఠాత్మకమైన కేవీ రమణ జాతీయ జీవనసాఫల్య పురస్కారం లభిం చింది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు శిరోమణి, డాక్టర్ వంశీరామరాజు చెప్పారు. శుక్రవారం హైద్రాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో తెలంగాణ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా కడిమెళ్ళకు ఈ అవార్డును అందజేయనున్నారు. ప్రతి ఏటా వంశీ ఇంటర్నేషనల్ సంస్థ ఈ అవార్డును ప్రధానం చేస్తూ వస్తుంది. 2024లో నరసాపురం పట్టణానికి చెందిన కడిమెళ్ళను ఈ అవార్డుకు ఎంపిక చేశారు.


ఏలూరు రైల్వేస్టేషన్‌లో బందోబస్తులో ఉన్న ఆర్పీఎఫ్, జీఆర్పీ పోలీసులు

ఏలూరు మీదుగా వెళ్లిన అయోధ్య ప్రత్యేక రైలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 : అయోధ్యకు వెళ్ళే స్పెషల్ ట్రైన్ (ట్రైన్ నెంబర్ 07215) రైలు బుధవారం ఏలూరు రైల్వే స్టేషన్ మీదుగా విజయవాడకు వెళ్ళింది. ఏలూరు రైల్వేస్టేషన్‌లో 200 మంది అయోధ్యకు ఆ రైలులో వెళ్ళారు. ముందస్తుగా ఏలూరు రైల్వే పోలీసులు ఆర్పీఎఫ్ పోలీసులు ప్రత్యేక బందోబస్తు నిర్వహించి ప్రయాణికులకు తగు సూచనలు చేశారు.

చిక్కుల్లో చేప రైతు

పడిపోయిన ధరలు
ఎగుమతులు అంతంత మాత్రమే


తెల్ల చేపలు
ఫంగస్ చేపలు

కలిదిండి, ఫిబ్రవరి 7 :చేప ధర పతనమైంది. ఇంతకుముందు తెల్లచేప కిలో రూ.120 ఉండగా, ఒక్కసారిగా రూ.102కి పడిపోయింది. దీంతో చేపల పెంపకందార్లు ఆందోళన చెందుతున్నారు. జిల్లా నుంచి ప్రతిరోజు సుమారు 400 నుంచి 600 లారీల చేపలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అయ్యేవి. ప్రస్తుతం 200 నుంచి 300 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. అసోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో చేపల కొనుగోళ్లు నిలుపుదల చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల మేత డీవోబీ తవుడు 10 టన్నులు లక్షా 80 వేలు పలుకుతోంది. లీజు ఎకరాకు లక్ష వరకు ఉంది. ఖర్చు పెరిగి ఎగుమతులు లేక ధర పడిపోవటంతో రైతులు తల్లడిల్లుతున్నారు.

ఫంగస్‌దీ అదే దారి..

ఫంగస్ చేపల సాగు తీవ్ర సంక్షోభంలో పడింది. ఫంగస్ సాగు చేసిన రైతులు భారీగా నష్టపోతున్నారు. ఇంతకు ముందు ఫంగస్ కిలో రూ.95 పలకగా ప్రస్తుతం రూ.65కి పడిపోయింది. కిలో ఫంగస్ పెరుగుదలకు రూ.80 ఖర్చు అవుతుందని మేత భారం ఎక్కువైందని, కిలో రూ.65కి అమ్మితే తీవ్రంగా నష్టాల్లో మునిగిపోతామని రైతులు వాపోతున్నారు. పలు రాష్ట్రాల్లో చేపలు మార్కెట్‌లను మూసివేయటంతో చేపల ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయినట్టు సమాచారం. ఫంగస్ చేపల రైతులు, బ్రీడర్లు, ఫీడ్ కంపెనీ యజమానులతో ప్రభుత్వం సమావేశం నిర్వహించాలని, ఆక్వా ఆటుపోట్లుపై చర్చించి కిలో ధర కనీసం రూ.80 కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలి



తెల్ల చేప ధర కిలో రూ.120, ఫంగస్ రూ.80 ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మేత ధరలు తగ్గించాలి. తెల్ల చేపల ఎగుమతులు తగ్గటంతో వ్యాపారులు చేపల కొనుగోలుకు ఆసక్తి చూపటం లేదు. దీంతో చేపలను ఏ విధంగా అమ్ముకోవాలో తెలియటం లేదు. తెల్ల చేపలు, ఫంగస్‌లను ఈశాన్య రాష్ట్రాలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

- అక్కల బోసు, ఆక్వా రైతు

క్రైం కార్నర్

భార్యతో గొడవ..మనస్థాపంతో ఆత్మహత్య

తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 7: భార్యతో గొడవపడి మనస్థాపంతో వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెంలో బుధవారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంజయ్(28) కూలిపని చేసుకుని జీవనం సాగిస్తుంటాడు. వారం క్రితం భార్యతో గొడవపడి విజయవాడ పనికోసం వచ్చిన తన బంధువులు వద్దకు బయలుదేరాడు.మనస్థాపంతో ఉన్న సంజయ్ నవాబుపాలెం వద్ద చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా పడి ఉన్నాడు. సంజయ్ సెల్‌ఫోన్ ఆధారంగా అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సురేష్ తెలిపారు.

ఎదురెదురుగా బైక్‌లు ఢీ ..ఒకరి మృతి

పెదవేగి, ఫిబ్రవరి 7 : ఎదురెదురుగా వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో గాయపడిన ఇద్దరిలో ఒకరు చికిత్స పొందుతూ మృతిచెందగా మరొకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్టు పెదవేగి ఎస్ఐ వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ముండూరు గ్రామానికి చెందిన రాచూరి విద్యాసాగర్ ద్విచక్ర వాహనంపై ఊరూరా తిరుగుతూ పూరీలు, బొబ్బట్లు, చపాతి వంటి తినుబండారాలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి తొమ్మిది గంటల సమయంలో రాట్నాలకుంట వైపునించి తిరిగొస్తుండగా పెదవేగి గ్రామంలో పెదవేగికి చెందిన బొల్లా పోతురాజు ఎదురుగా బైక్‌పై వస్తూ విద్యాసాగర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రెండు ద్విచక్ర వాహనదారులు గాయాలపాలవ్వగా ఇద్దరినీ 108 అంబులెన్స్‌లో ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాచూరి విద్యాసాగర్ (37) మంగళవారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 : వేగంగా వెళ్తున్న రైలు నుంచి గుర్తు తెలియని ఒక యువకుడు ప్రమాదవశాత్తు జారిపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని వట్లూరు రైల్వే స్టేషన్ దాటిన తరువాత సుమారు 20 నుంచి 25 సంవత్సరాల వయసు ఉన్న యువకుని మృత దేహం రైలు పట్టాలపై ఉంది. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ నరసింహారావు సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృతుడు సుమారు 5.5 అడుగుల ఎత్తు కల్గి, చామన ఛాయ శరీరంతో ఉన్నాడు. ఆకు పచ్చరంగు పొడవు చేతుల టీషర్టు, సిమెంటు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతుని వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ నరసింహారావు సెల్ నంబర్ 95020 97672కు సమాచారం అందించాలని కోరారు.

అప్పుల వేధింపుల భరించలేక మహిళ ఆత్మహత్య

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 : అప్పు ఇచ్చిన వ్యక్తి వేధింపులకు గురి చేయడంతో వేధింపులకు భరించలేక పురుగుమందుతాగి ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ ఒక మహిళ మృతి చెందింది. ఉండి మండలం ఎస్ఆర్‌కె అగ్రహారానికి చెందిన మహేశ్వరి (45) తన కుమార్తెతో సొంత ఇంటిలో నివాసం ఉంటున్నారు. ఉండికి చెందిన ఇరువురు వ్యక్తుల వద్ద తన ఇల్లు తనఖాపెట్టి అప్పు తీసుకుంది. వడ్డీలు కట్టినప్పటికీ ఇంకా 18 లక్షలు కట్టాలని వేధింపులకు గురిచేయడంతో ఆ వేధింపులు భరించలేక ఆమె మంగళవారం పురుగుమందు తాగింది. తీవ్ర అస్వస్థతకు గురైన ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం అందించగా ఎమ్మెల్సీగా నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటపై దాడి.. తొమ్మిది మంది అరెస్టు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 : ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కబడ్డీగూడెంలో పేకాట ఆడుతున్నట్లు టూటౌన్ సీఐ ఎం.ప్రభాకర్‌కు సమాచారం అందింది. దీంతో తన సిబ్బందితో దాడి చేశారు. పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.9200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం..కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 : ఒక వివాహిత ఇంటి నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదని ఫిర్యాదు అందడంతో ఏలూరు టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు గన్‌బజార్‌కు చెందిన ఆరుగొలను దివ్య (32)కు భర్త కిషోర్, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఏడాది జనవరి 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినప్పటికీ ఆచూకీ కానరాకపోవడంతో కుటుంబ సభ్యులు ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భర్త కనిపించడం లేదంటూ భార్య ఫిర్యాదు

ఆకివీడు, ఫిబ్రవరి 7: తన భర్త కనబడుటలేదంటూ భార్య ఫిర్యాదు మేర ఎస్ఐ బత్తిన నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అయి-భీమవరం ఇందిరమ్మ కాలనీకి చెందిన కోనాల ఆనంద్‌కుమార్ గత నెల 27 నుంచి కనిపించడం లేదు. బంధువులు చుట్టుపక్కల గాలించినప్పటికీ ఆచూకీ లేకపోవడంతో బుధవారం ఆనంద్‌కుమార్ భార్య సుధ ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదు చేశారు.

పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం.. యువకుడిపై కేసు నమోదు

ఉండి, ఫిబ్రవరి 7:పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేసిన యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఉండి మండలం పాందువ్వ గ్రామానికి చెందిన మట్టా చిట్టిబాబు అదే ప్రాంతానికి చెందిన యువతిని ప్రేమపేరుతో నమ్మించి పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి మోసం చేశాడు. బాధిత కుటుంబీకులు గ్రామపెద్దల దృష్టికి తీసుకు వెళ్లారు. యువతిని పెళ్లి చేసుకోవడానికి యువకుడు అయిష్టత చూపడంతో యువతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టుఉండి ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

మహిళపై అసభ్య ప్రవర్తన..ఆటో డ్రైవర్‌పై కేసు

ఉండి,ఫిబ్రవరి 7: ఆసుపత్రికి ఆటోలో వెళ్తున్న మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఆటో డ్రైవర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆకివీడు మండలం సిద్దాపురానికి చెందిన పూజారి చిన్ని మంగళవారం సాయంత్రం ఆకివీడులో ట్రక్కు ఆటోలో భీమవరంలోని ఆసుపత్రిలో వున్న తన కుమార్తెను చూడటానికి బయలుదేరింది. చెరుకువాడ గ్రామానికి వచ్చేసరికి మహిళ ఒంటరిగా వుండటంతో ఆమెపై ఆటోడ్రైవర్ క్రిస్టియాన్ అసభ్యకరంగా ప్రవర్తించాడు.దాంతో భయాందోళనతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు ఆటోను ఆపి ఆమె వివరాలను తెలుసుకుని బంధువులను రప్పించి అప్పగించారు. అక్కడ నుంచి ఉండి పోలీసుస్టేషన్‌కు వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆటోడ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ యేషయా తెలిపారు.

రుణాలిస్తామంటూ మాయమాటలు.. చీటింగ్ కేసు నమోదు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 : నలుగురికి సాయం చేద్దామనుకున్న ఆయన ఇరుక్కుపోయాడు. ఒక గుర్తు తెలియని నంబర్ నుంచి ఆయనకు ఫోన్ రావడంతో ఆ వ్యక్తి మాయమాటల్లో పడిపోయాడు. నిరుద్యోగ యువతకు తాము స్వయం ఉపాధి కల్పిస్తామని లక్షన్నర వరకూ ఎలాంటి ష్యూరిటీ లేకుండా రుణం ఇస్తామని అయితే పేదవారై ఉండాలని అందుకు ఆ ప్రాంతంలో మీరే ఎంపిక చేసి పదిమంది వివరాలు ఇస్తే రుణాలు ఇస్తామని చెప్పారు. అయితే రిజిస్ట్రేషన్ ఫీజుగా ఏడు వేల రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని నమ్మబలికాడు. ఈ మాటలు నమ్మిన ఏలూరు వెన్నవల్లివారి పేటకు చెందిన రామకూర కిరణ్‌కుమార్ తన ప్రాంతంలో ఉన్న పది మంది యువకుల చేత ఒక్కొక్కరి నుంచి రూ.7 వేలు ఆ గుర్తు తెలియని వ్యక్తి ఫోన్‌పే నెంబర్‌కు ఫోన్‌పే చేయించారు.ఎంతకాలం అయినా రుణాలు ఇవ్వలేదు. ఫోన్ చేస్తే అందుబాటులో లేదు. బుధవారం ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు కిరణ్‌కుమార్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తాడేపల్లిగూడెంలో 20 కాసుల బంగారం చోరీ



తాడేపల్లిగూడెం రూరల్, ఫిబ్రవరి 7: తాడేపల్లిగూడెం పట్టణంలోని యాగర్లపల్లిలో ఓ ఇంట్లో దొంగలు పడి 20 కాసుల బంగారం, రూ.6 లక్షల నగదు చోరీ చేశారు. యాగర్లపల్లికి చెందిన ఫోటోగ్రాఫర్ రాము బంధువుల ఇంట్లో వ్యక్తిగత పనుల నిమిత్తం రెండు రోజుల క్రితం వేరే ఊరు వెళ్లాడు. అయితే బుధవారం రాము ఇంటికి వచ్చేసరికి తలుపులు పగలకొట్టి బీరువాలో వస్తువులు చెల్లా చెదురుగా ఉండటాన్ని గమనించాడు. 20 కాసుల బంగారు నగలు, రూ.6 లక్షల నగదు చోరీకి గురైనట్టు గుర్తించాడు. ఈ మేరకు పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వివరించారు.

పొగాకు బ్యారన్‌లో చెలరేగిన మంటలు రూ.2 లక్షల ఆస్తినష్టం

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 7: జంగారెడ్డిగూడెం పట్టణంలోని సుబ్బంపేటలో గల పొగాకు బేరన్‌లో బుధవారం మంటలు చెలరేగడంతో వర్జీనియా పొగాకు, బ్యారన్ సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. సుబ్బంపేట నందుగల ముళ్ళపూడి రమారత్నంకు చెందిన వర్జీనియా పొగాకు బ్యారన్ క్యూరింగ్ జరుగుతుండగా బుధవారం ఉదయం బ్యారన్‌లో మంటలు చెలరేగాయి. స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించడంతో అగ్నిమాపక వాహనంతో మంటలను అదుపు చేశారు. అగ్నిమాపకశాఖ ఎస్సై అబ్రహం మాట్లాడుతూ రూ.2 లక్షల విలువైన వర్జీనియా పొగాకు, బ్యారన్ సామాగ్రి దగ్ధమైనట్లు తెలిపారు. అనంతరం బ్యారన్‌ను పొగాకు బోర్డు అధికారులు సందర్శించారు.

రూ.4 లక్షల విలువైన రేషన్ బియ్యం సీజ్



జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 7 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యం లారీను రెవెన్యూ పోలీస్ అధికారులు అడ్డుకున్నారు. తెలంగాణ రాష్ట్రం కరీంనగర్ జిల్లా చొప్పగొంది నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలిస్తున్న 23 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని బుధవారం ఉదయం లక్కవరం ఎస్సై సుధీర్, సివిల్ సప్లై డీటీ శ్రీలక్ష్మీ తనిఖీ చేసి లారీను అదుపులోకి తీసుకున్నారు. బియ్యంను భద్రపరచినట్లు డీటీ తెలిపారు. పట్టుబడ్డ బియ్యం విలువ 4,14,000 ఉంటుందని, లారీ విలువ రూ.7 లక్షలు ఉందని తెలిపారు. లారీ యజ మాని అయితం కృష్ణ, డ్రైవర్ అంకూరి రామస్వామిలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసున్నారు.



ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

'మున్సిపల్' సమ్మె హామీలు నెరవేర్చాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 7: మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డి జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఆర్ఆర్.పేటలో సమస్యల పరిష్కరించాలంటూ బుధవారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పలరాజు మాట్లాడుతూ సంక్రాంతి కానుక రూ.వెయ్యి ఇవ్వాలన్న జీవో అమలు చేయాలన్నారు. సమ్మె కాలనీకి వేతనాలు చెల్లించాలన్నారు. స్కిల్డ్, సెమీ స్కిల్డ్‌లకు వేతనాలు పెంచాలన్నారు. మంత్రివర్గం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే మళ్ళీ ఉద్యమం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నారాయణరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, శ్రీను, అప్పారావు, శ్రీనివాస్‌లు, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా నాయకుడు

'ఉపాధి హామీ' పటిష్టంగా అమలు చేయాలి

జంగారెడ్డిగూడెం టౌన్, ఫిబ్రవరి 7: ఉపాధి హామీ పథకం పటిష్టంగా అమలు చేసి, వేతన బకాయిలు విడుదలచేయాలి ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. యాగంటి సీత అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం, అందుగుల ప్రభాకర్‌రావు మాట్లాడారు. ప్రతి కుటుంబానికి 200 రోజులు పని రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. తక్షణమే ఈ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఇంకో పక్క పని జరిగే గ్రామాలలో పే స్లిప్పులు ఇవ్వడం లేదని. దీని ద్వారా కూలీలు వేతనాలు కోల్పోతున్నారని ఉపాధి హామీ అధికారులపై మండిపడ్డారు. సమావేశంలో జోడే సూర్యచంద్రరావు, కె.సుబ్బారావు, వామిశెట్టి నరసరావు, కె.వెంకటేశ్, పి.చంటి, తదితరులు పాల్గొన్నారు



పోస్టర్లను ప్రదర్శిస్తున్న సంఘ నాయకులు

ఓపీఎస్ పునరుద్ధరించే పార్టీకే ఓటు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: పాత పెన్షన్ పునరుద్ధరణ డిమాండ్‌తో యూటీఎఫ్ చేపట్టిన దశలవారీ ఉద్యమంలో భాగంగా 'ఓట్ ఫర్ ఓపీఎస్' వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ ప్రజల భవిష్యత్‌ను నిర్ణయించేది రాజకీయ నాయకులేనని, అలాగే వారి రాజకీయ భవిష్యత్‌ను నిర్ణయించేది తమ ఓటే అన్నారు. పాత పెన్షన్ పునరుద్ధరించే పార్టీకే రానున్న ఎన్నికల్లో ఓటేస్తామని వెల్లడించారు. సీపీఎస్, జీపీఎస్‌లను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఏఆర్‌డీజీకే మున్సిపల్ హైస్కూలు హెచ్‌ఎం ఉజ్వల, సంఘ నాయకులు శివశంకరరావు, రాజారావు, కిరణ్‌కుమార్, వాణీప్రసన్న, అప్పారావు, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.



చిన్నారులకు టీకా వేస్తున్న ఏఎన్ఎం

వ్యాధి నిరోధక టీకాలతో ఆరోగ్యం

పెదవేగి, ఫిబ్రవరి 7: చిన్నారుల ఆరోగ్య సంరక్షణకు వ్యాధి నిరోధక టీకాలు దోహదపడ తాయని ఏఎన్ఎం జి.మౌనిక అన్నారు. వ్యాధినిరోధక టీకాల కార్యక్రమంలో భాగంగా పెదవేగితోపాటు పలు గ్రామాల్లో బుధవారం ఐదేళ్లలోపు చిన్నారులకు టీకాలు వేశారు. గర్భవతులకు ధనుర్వాతం రాకుండా టీటీ ఇంజక్షన్లు చేశారు. పెదవేగిలోని అంగన్‌వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో మౌనిక మాట్లాడుతూ చిన్నారుల ఆరోగ్య సంరక్షణ తల్లులపై ఆధారపడి ఉంటుందన్నారు. చిన్నారులకు సకాలంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని, అప్పుడే వారి ఆరోగ్యం పదిలంగా ఉంటుందని ఆమె చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కృష్ణవేణి, మల్లిక, ఆశా కార్యకర్తలు తులసి, వల్లి, కృష్ణకుమారి, గర్భవతులు, తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలి : కలెక్టర్



సమావేశంలో కలెక్టర్, ఎస్పీ

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం జరిగింది. ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై ఎస్పీ డి.మేరీ ప్రశాంతితో కలసి అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఆర్అండ్‌బి, రవాణా, జాతీయ రహదారుల అధికారులు సంయుక్తంగా ప్రమాదాలకు కారణాలపై అధ్యయనం చేసి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. గత ఏడాది 636 రోడ్డుప్రమాదాల్లో 284మంది మృతిచెందారని, 617మంది గాయపడ్డారన్నారు. 203 ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 107మంది హెల్మెట్ ధరించకపోవడంతో ప్రమాదాలకు గురయ్యారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్, రవాణా శాఖ అధికారులు చెక్‌పోస్టుల వద్ద నిఘా ఉంచాలన్నారు. ఎస్పీ డి.మేరీప్రశాంతి మాట్లాడుతూ రహదారి భద్రత అందరి బాధ్యత అన్నారు. ఆర్అండ్‌బి ఎస్ఈ జాన్‌మోషే, ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతకుమారి, బీసీహెచ్ఎస్ పాల్‌సతీష్, మున్సిపల్ కమిషనర్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన డీఈవో అబ్రహం

ఏలూరు జిల్లా విద్యాశాఖ అధికారిగా బుధవారం బాధ్యతలు స్వీకరించిన ఎస్.అబ్రహం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెంకటేస్ డీఈవోను అభినందించారు.

● ఏలూరు ఎడ్యుకేషన్: ఏపీ రెవెన్యూ సర్వీసుల సంఘం (ఏపీఆర్ఎస్ఏ) రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా ఇటీవల ఎన్నికైన కె.రమేష్‌కుమార్ బుధవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేశ్, జేసీ లావణ్యవేణి, డీఆర్వో పుష్పమణిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రమేష్‌కుమార్ ప్రస్తుతం సంఘ జిల్లా అధ్యక్షుడిగా కూడా వ్యవహరిస్తున్నారు. ఆయనకు జిల్లా అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రమోద్‌కుమార్ తదితరులున్నారు.

సచివాలయాల్లో జనన, మరణాల నమోదు



సదస్సులో మాట్లాడుతున్న రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7 : జనన, మరణ తేదీలను సచివాలయ కార్యాలయాల్లో నమోదు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ సూచించారు. గ్రామ సచివాలయ కార్యదర్శులు, వీఆర్వోలకు జనన, మరణ ధ్రువపత్రాల జారీ, వివాహాల రిజిస్ట్రేషన్ చట్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. రత్న ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పిల్లల జనన తేదీ కార్యాలయంలో నమోదు చేయించాలన్నారు. వివాహాలు కూడా నమోదు చేయించుకోవాలని సూచించారు. లోక్‌అదాలత్ చైర్‌పర్సన్ మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ వివిధ పంచాయతీలలో పేరుకు పోయిన బకాయిలను పర్మినెంట్ లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఏలూరు మున్సిపల్ అదనపు కమిషనర్ చంద్రయ్య పాల్గొన్నారు.

తలసేమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రసాదరావు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7: రెడ్‌క్రాస్ భవనంలో 15 మంది తలసేమియా బాధిత చిన్నారులకు బుధవారం రక్తమార్పిడి చేసినట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ బీవీ.కృష్ణారెడ్డి తెలిపారు. ఇన్నవీల్ క్లబ్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ వి సుబ్బలక్ష్మి, హనుమంతరావు దంపతులు తలసేమియా కేంద్రానికి రూ.16 వేల విరాళం అందించారు. చిన్నారులకు, వారి కుటుంబ సభ్యులకు మల్లిశెట్టి తిరుమలరావు కృష్ణ తులసి భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వర ప్రసాదరావు, టీఎస్ సుబ్బలక్ష్మి, జి.అచ్యుత, వీవీవీ.హనుమంతరావు, పీవీ.రమణ, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

తపన సేవలపై జబర్దస్త్ కళాకారుల ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న జబర్దస్త్ కళాకారులు

టి.నరసాపురం, ఫిబ్రవరి 7: మండలంలోని మల్లుకుంట, బొర్రంపాలెం, శ్రీరామవరం, టి.నరసాపురం గ్రామాలలో జబర్దస్త్ కళాకారులు, సినీ గాయకుల బృందం సందడి చేసింది. మోదీ ప్రభుత్వ అభివృద్ధి, తపన ఫౌండేషన్ ద్వారా గారపాటి చౌదరి సేవాకార్యక్రమాలపై బుధవారం ప్రచారం చేశారు. జబర్దస్త్ కళాకారులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోద్ (వినోదిని), ఇమ్మాన్యుయేల్ కామెడీ షో, సినీ గాయని గాయకులు లాస్య ప్రియ, అరుణ్ కౌండిన్య సినీ పాటలతో అలరించారు. సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో గారపాటి చౌదరిని ఎంపీగా గెలిపించుకుంటే మరింత అభివృద్ధి సాధించవచ్చన్నారు. మొడియం శ్రీనివాసరావు, మాలెంపాటి హరిబాబు, కొండేపాటి రామకృష్ణ, కాంచనమాల, కె.అన్నవరం పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో టీడీపీ నేతల పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న నాయకులు

లింగపాలెం, ఫిబ్రవరి 7: స్థానిక సాయిబాబా ఆలయంలో టీడీపీ నేతలు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా పూజలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ నాయకులు సొంగా రోషన్ కుమార్, గరిమెళ్ళ చలపతిరావు, మోరంపూడి మల్లికార్జున్‌రావు, తాతిన రాధాకృష్ణ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశంపార్టీ విజయం సాధించాలని ప్రత్యేక పూజలు చేశారు. వీరితో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. భక్తులకు అన్న సమారాధన చేశారు.

ఫుట్‌బాల్ ఫెడరేషన్ డిప్యూటీ చైర్మన్‌గా శ్రీధర్

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 7: ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ డిప్యూటీ చైర్మన్‌గా ఎంపీ కోటగిరి శ్రీధర్ ఎంపికయ్యారు. ఆయనకు ఆటోనగర్ అసోసియేషన్ అభినందలు తెలిపింది. ఏలూరు టౌన్ ఆటోమొబైల్స్ మెకానిక్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం శ్రీధర్‌కు అభినంద సభ నిర్వహించారు. యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు నాగేశ్వరరావు, సత్యనారాయణ మాట్లాడుతూ ఫుట్‌బాల్ క్రీడాభివృద్ధికి విశేషంగా శ్రీధర్ కృషి చేశారన్నారు. రాబోయే రోజుల్లో శ్రీధర్ నాయకత్వంలో ఫుట్‌బాల్ క్రీడ అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దివ్యాంగురాలికి ల్యాప్‌టాప్ అందజేత

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 7: దివ్యాంగురాలైన బికాం మొదటి సంవత్సరం విద్యార్థిని ఎం.లీలాంబికకు జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల శాఖ ఏడీ రాకాడమణి బుధవారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. ప్రభుత్వం దివ్యాంగులైన విద్యార్థులకు ల్యాప్‌టాప్ సౌకర్యం కల్పించిందని ఆమె తెలిపారు.







సోమవరప్పాడులో కరపత్రాల పంపిణీ చేస్తున్న చింతమనేని, పాతూరులో ఇంటింటి ప్రచారం చేస్తున్న నేతలు, టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మహిళలకు అండగా చంద్రన్న

టీడీపీ నేతల ప్రచారం

దెందులూరు, ఫిబ్రవరి 7: మహిళలకు చంద్రన్న అండగా ఉంటారని, టీడీపీ అధికారంలోకి రాగానే మహిళాశక్తి పథకం అమలు చేస్తామని మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. మండలంలోని సోమవరప్పాడులో బుధవారం బాబు ష్యూరిటీ బాబు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ పాలనలోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సంక్షేమం సాధ్యమన్నారు. చింతమనేని ప్రభాకర్ ఇంటింటికి తిరిగి టీడీపీ ఎన్నిక హామీల పత్రాలను పంపిణీ అందజేశారు. టీడీపీ నేతలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

● కామవరపుకోట : తెలుగుదేశం పార్టీ ప్రకటించిన సూపర్-6 పథకాలతో ప్రజల్లో ఆదరణ పెరిగిందని మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీరామకృష్ణ, కిలారు సత్యనారాయణ అన్నారు. పాతూరులో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబు నాయుడు, పవన్‌కల్యాణ్ సంతకాలతో కూడిన బాండ్ పేపర్లను, సూపర్-6 పథకాల బ్రోచర్లను పంపిణీ చేశారు. ప్రజలు టీడీపీ, జనసేన కూటమికి ఆహ్వానం పలుకుతున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ విజయం అందుకుంటుందన్నారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు, జనసేన కార్యకర్తలు ఉన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 7: సైకో జగన్ పాలనపై విసుగు చెందిన వైసీపీ కార్యకర్తలంతా టీడీపీ వైపు పరుగులు తీస్తున్నారు. 19వ డివిజన్ పొత్తూరి ఇందిరమ్మ కాలనీకి చెందిన వందలాది మంది బుధవారం టీడీపీలో చేరారు. బడేటి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బడేటి రాధాకృష్ణయ్య(చంటి) సమక్షంలో వారు పార్టీలో చేరారు. టీడీపీ సిద్ధాంతాలకు ఆకర్షితులై ఏలూరు నియోజకవర్గంలోని వైసీపీ కార్యకర్తలంతా టీడీపీలోకి వలసలు వస్తున్నారని చంటి అన్నారు.



బాలరాముని దర్శనానికి వెళుతున్న బీజేపీ కార్యకర్తలు

బాలరాముని దర్శనానికి వెళ్లిన బీజేపీ కార్యకర్తలు

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 7: అయోధ్యలో బాలరాముని దర్శనానికి బీజేపీ కార్యకర్తలు బుధవారం తరలివెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్ 300మంది భక్తులను సాగనంపారు. తపన ఫౌండేషన్ చైర్మన్ రేణుక చౌదరి మాట్లాడుతూ అయోధ్యకు వెళ్ళే భక్తులకు ఫౌండేషన్ తరఫున సహాయ సహకారం అందిస్తామన్నారు. నిర్మలకిషోర్, కె.నారాయణ, కె.కృష్ణప్రసాద్, నడపన దాన భాస్కరరావు, మత్తే శాస్త్రి ఎం.రామకృష్ణ పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం: మండలం నుంచి పలువురు భక్తులు బాలరాముని దర్శనానికి అయోధ్యకు బయల్దేరారు. మండలం నుంచి ఆరుగురు రామ మందిర దర్శనం కోసం బయలుదేరి వెళ్ళారని తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ కొండేపాటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను అడ్డుకోవడం దుర్మార్గం

కుక్కునూరు ఫిబ్రవరి 7: ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని జరిగే ధర్నాను అడ్డుకోవడం దుర్మార్గమని సీఐటీయూ మండల కార్యదర్శి యర్రం సాయికిరణ్ విమర్శించారు. విజయవాడలో జరిగే ధర్నాకు వెళుతున్న వారిని పోలీసులు అడ్డుకుని హౌస్ అరెస్ట్ చెయ్యడాన్ని ఖండించారు. ప్రజారోగ్యానికి అహర్నిశలు కృషి చేస్తున్న ఆశలు చాలీచాలని వేతనాలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యలు పరిష్కరించడం చేతకాక అరెస్టు చేయించడం సిగ్గు చేటని విమర్శించారు. కనీస వేతనం ఇవ్వకుండా గౌరవ వేతనం ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు, సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని సాయికిరణ్ హెచ్చరించారు. ఆశాలు కారం రాజేశ్వరి, శ్రావణి, బాపనమ్మ,మార్తమ్మ, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పట్టిసీమ ఫెర్రీలో రక్షణ చర్యలు తీసుకోవాలి

పోలవరం, ఫిబ్రవరి 7: పట్టిసీమ ఫెర్రీ వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారుల నిర్లక్ష ధోరణితో వ్యవహరించడం సరికాదని టీడీపీ మండల నాయకులు మంగిన కొండ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల నేపథ్యంలో ఫెర్రీ ప్రమాదకరంగా ఉందన్నారు. ఫెర్రీ పక్కనే పట్టిసీమ కొవ్వాడ కాలువ అవుట్ ఫాల్ స్లూయిజ్ కి గోదావరి వైపు గట్లకు రిటైనింగ్ వాల్ నిర్మించకపోవడం వల్ల పట్టిసీమ ఫెర్రీ రేవులో భవనాలు, ఫెర్రీ రేవు కోతకు గురై కాలువలో పడిపోయే పరిస్థితులు నెలకొన్నాయన్నారు. మహాశివరాత్రి ఉత్సవాలు సమీపిస్తున్న నేపథ్యంలో రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఇప్పటికే భవనం వరకూ గట్టు కోతకు గురైందని, ఉపేక్షిస్తే ప్రమాదాల తీవ్రత పెరుగుతుందన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయండి

చింతలపూడి, ఫిబ్రవరి 7: ఓటర్ల జాబితాలలో అభ్యంతరాలు ఉంటే పరిశీలిస్తామని చింతలపూడి ఎన్నికల రిటర్నింగ్ అధికారి కె.అద్దయ్య తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సమావేశం జరిగింది. ఓటర్ల జాబితాలో సవరణ కోసం దరఖాస్తు చేయాలన్నారు. ప్రస్తుతం నియోజకవర్గంలో ఓటర్లు 2,71,502 మంది ఓటర్లు నమోదయ్యారని చెప్పారు. అంతకుముందు ఎన్నికల మెటీరియల్ పంపిణీ కోసం వ్యవసాయ మార్కెట్‌లోని గోడౌన్లను పరిశీలించారు. సమావేశంలో టీడీపీ, వైసీపీ, బిజెపి, కాంగ్రెస్, వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 190మంది గైర్హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 7: జిల్లాలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్ ప్రాక్టికల్స్ పరీక్షకు 190 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 1588మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 1398 మంది హాజరయ్యారని డీవీఈవో బి.ప్రభాకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు నమోదు కాలేదన్నారు.

చదువులతోపాటు క్రీడల్లో రాణించాలి



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న పీవో

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 7: విద్యార్థులు, యువత చదువులతోపాటు క్రీడల్లో రాణించాలని ఐటీడీఏ పీవో ఎం.సూర్యతేజ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో టీబీఆర్ ఫౌండేషన్ నిర్వహిస్తున్న ఆటల పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. అంతకముందు జాతీయ జెండా, ఆటల పోటీల జెండా, ఆదివాసీ జెండాలు ఆవిష్కరించారు. ఐటీడీఏ ద్వారా క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి, మొడియం రామతులసి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, క్రీడాకారులు, పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు. అనంతరం మండల పరిషత్ ఆవరణలో జరిగిన ఆసరా కార్యక్రమంలో మహిళలకు చెక్కులు పంపిణీ చేశారు.

క్రీడలు విద్యార్థుల జీవితాల్లో భాగం కావాలి



బహుమతులు అందుకున్న విద్యార్థులు

పెదవేగి, ఫిబ్రవరి 7: క్రీడలు విద్యార్థుల జీవితాల్లో భాగం కావాలని భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వీఎన్‌వీ.శ్రీలక్ష్మి అన్నారు. చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భోగాపురం, కొప్పాక పాఠశాల విద్యార్థులకు బుధవారం ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. హెచ్‌ఎం శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఆటపాటలు విద్యార్థుల జీవితాల్లో ఖచ్చితంగా ఉండాలన్నారు. అప్పుడే విద్యార్థి జీవితం ఉన్నతంగా మారుతుందని ఆమె చెప్పారు. చైల్డ్‌రైట్స్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ ఎస్.రవిబాబు, బి.కనకదుర్గ, బి.జ్ఞానశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 7: గ్రామ స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలని నియోజకవర్గ కన్వీనర్ శరణాల మాలతీరాణి కార్యకర్తలకు సూచించారు. నారాయణపురంలో బుధవారం నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కోడూరి లక్ష్మీ నారాయణ, జిల్లా అధ్యక్షుడు చౌటుపల్లి విక్రమ కిషోర్, కె.కృష్ణ ప్రసాద్, చక్రవర్తి, నడపన దాన భాస్కర్, పెన్మత్స రామచంద్రరాజు పాల్గొన్నారు. పలువురు బీజేపీలో చేరారు. నారాయణపురంలో పార్టీ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు.

కార్మిక వర్గంపై అణచివేత ధోరణి

చింతలపూడి, ఫిబ్రవరి 7: ప్రభుత్వం కార్మిక వర్గంపై అణచివేత ధోరణిని ప్రభుత్వం వ్యవహరిస్తుందని సీపీఎం నాయకులు ఆర్‌వీ.సత్యనారాయణ, నత్తా వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఆశా కార్యకర్తలు, సీఐటీయు, సీపీఎం నాయకులను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. కార్మిక వర్గంపై ప్రభుత్వం అణచివేత ధోరణిగా ఉందని విమర్శించారు. తమ చిరకాల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న ఆశా కార్యకర్తలు ప్రభుత్వానికి విన్నవించుకోవడానికి విజయవాడ వెళ్తుంటే సమస్యలు పరిష్కరించలేని ఈ ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేయించి నోటీసులు ఇచ్చి భయభ్రాంతులకు గురిచేయడం దారుణమని పేర్కొన్నారు.

'ప్రజా విశ్వాసం కోల్పోయిన జగన్'

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 7: వైసీపీ నేత, సీఎం జగన్ రెడ్డి ప్రజా విశ్వాసం కోల్పోయారని, వచ్చే ఎన్నికల్లో ఆయన ఇంటి బాట పట్టడం ఖాయమని జనసేన జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు అన్నారు. పవరుపేటలోని జనసేన కార్యాలయం వద్ద బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ, జనసేన కూటమికి ప్రజాదరణ పెరుగుతుందన్నారు. అన్నివర్గాల్లో జగన్‌కు వ్యతిరేకత, కూటమికి ఆదరణ లభిస్తుందన్నారు. జనసేన నాయకులు నగిరెడ్డి కాశీ నరేష్, సరిది రాజేష్, రెడ్డి గౌరీశంకర్, కందుకూరి ఈశ్వరరావు, తదితరులు ఉన్నారు.



జీలుగుమిల్లి రామాలయంలో శ్రీనివాస కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

వైభవంగా శ్రీనివాస కల్యాణం

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 7: లోక కల్యాణార్థం ధర్మ ప్రచారంలో భాగంగా జీలుగుమిల్లి రామాలయంలో శ్రీనివాస కల్యాణం వైభవంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం గోకుల పారిజాతగిరి ఆలయ ప్రధాన అర్చకులు నల్లూరి రవికుమార్ వేంకటేశ్వరస్వామి సమేత శ్రీదేవి భూదేవి కల్యాణం జరిపించారు. గడ్డమణుగు సోమరాజు స్వామి వారికి పట్టు వస్త్రాలు అందజేశారు. ఈవో మానికల రాంబాబు, అర్చకులు టీఎస్.రామకృష్ణశర్మ పాల్గొన్నారు.

విజయలక్ష్మి ఆలయంలో చండీయాగం

జంగారెడ్డిగూడెం టౌన్: విజయదుర్గ ఆలయంలో చండీయాగం వైభవంగా నిర్వహించారు. వేద పండితులు సత్య కిరణ్ ఆధ్వర్యంలో అర్చకుడు సుదర్శనం వేణుగోపాలచార్యులు పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధా కృష్ణ, రామిశెట్టి శ్రీనివాసరావు, కర్పూరం తుకారం, గుడిమెట్ల యుగంధర్, వందనపు నాగ అప్పలరాజు, జల్లేపల్లి శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వినాయకుడి ఆలయాల్లో పూజలు

ఏలూరు కార్పొరేషన్: నగరంలోని వినాయకుడి ఆలయాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తొలుత స్వామివారికి అర్చకులు పంచామృతాభిషేకం జరిపి ప్రత్యేక అలంకరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సత్రంపాడు లక్ష్మీగణపతి, దక్షిణపువీధి, పత్తేబాద, ఆర్ఆర్ పేట, పవరుపేట, బావిశెట్టివారిపేట, తదితర ప్రాంతాల్లో విఘ్నేశ్వరస్వామి ఆలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

● కామవరపుకోట: చెరువుగట్టు వద్ద 42 అడుగుల వరసిద్ధి వినాయక స్వామి ఆలయం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. 108 కొబ్బరికాయలు కొట్టారు. లలితా పీఠం వ్యవస్థాపకులు సుదర్శనం రామదుర్గ కుమారాచార్యులు, సత్య శ్రీనివాసాచార్యులు భక్తులతో పూజలు చేయించారు. ఈ సందర్భంగా స్వామివారికి భక్తులు సామూహికంగా గరికతో అర్చన జరిపి బెల్లం నివేదనలు సమర్పించి హారతులు ఇచ్చి ఆరాధించారు.



చింతలపూడిలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చింతలపూడి, ఫిబ్రవరి 7: స్థానిక ప్రభుత్వ హైస్కూలులో చదివిన 1968-69 బ్యాచ్ ఎస్ఎల్‌సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కరిశెట్టి తిలక్ అధ్యక్షతన బుధవారం జరిగింది. విశాఖ, హైదరాబాదు, బెంగళూరుతోపాటు పలు ప్రాంతాల నుంచి సుమారు 40 మంది పాల్గొన్నారు. ఎవరు ఎక్కడ పనిచేస్తున్నారనే విషయాలతోపాటు తాము చదివిన కాలంలో జరిగిన సంఘటనలు తలచుకుని మురిసిపోయారు. తమ బ్యాచ్‌లో ఇటీవల మృతి చెందిన అల్లంశెట్టి సత్యనారాయణ, లింగంపల్లి వరప్రసాద్, త్యాగరాజుకు శ్రద్ధాంజలి ఘటిస్తూ మౌనం పాటించారు. సంఘ కార్యదర్శి పాకా సర్వేశ్వరరావు, ఆచంట శ్రీనివాస్, ఎండి.ఆలీ, గోపవరపు వెంకటేశ్వరరావు పాల్గొని తమ బ్యాచ్‌లోని విశేషాలను వివరించారు.

ఘనంగా ఉరుసు మహోత్సవం



దీపారాధన చేస్తున్న మహిళలు

ఏలూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 7 : కోటదిబ్బ వద్ద హజరత్ సయ్యద్ బాయాజీద్ మహాత్ముల ఉరుసు మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. దర్గాకు ప్రత్యేక అలంకారం చేశారు. జిల్లా నుంచే కాకుండా దూర ప్రాంతాల నుంచి కూడా ముస్లింలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు ముజువరులకు శుభాకాంక్షలు తెలిపారు. పూనె, బనారస్ కళాకారులతో ఖవాలీ ఘనంగా నిర్వహించారు. ముజువర్లు షేక్ ఇబ్రహీం కుమారులు షేక్ హుస్సేన్, సాబీర్ హుస్సేన్, షబ్బీర్ హుస్సేన్ ఏర్పాట్లు చేశారు.

శ్రీవారి సేవలో బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్



శ్రీవారి చిత్రపటాన్ని అందుకుంటున్న శ్రీనివాస్

ద్వారకా తిరుమల, ఫిబ్రవరి 7: శ్రీవారి ఆలయాన్ని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ శివశ్రీనివాసు బుధవారం సందర్శించారు. ముందుగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకపూజలు చేశారు. అర్చకులు వేదాశీర్వచనం అందించారు. ఏఈవో మెట్టపల్లి దుర్గారావు స్వామివారి చిత్రపటం అందజేశారు.

నామమాత్రంగా మండల పరిషత్ సమావేశం

భీమడోలు, ఫిబ్రవరి 7: ఎంపీపీ కనమాల రామయ్య అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం బుధవారం నామమాత్రంగా జరిగింది. వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొని మండలంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. వివిధ సమస్యలను, వాటి పరిష్కారాలను అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వర్ణలత, జడ్పీటీసీ భవానీ, తహసిల్దార్ వరహాలయ్య, వివిధ శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7: టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొత్తపేటలో మద్యం విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ప్రభాకరరావు, సిబ్బంది దాడి చేశారు. కొత్తపేటనకు చెందిన గోను నాగేశ్వరరావును అరెస్టు చేసి నాలుగు మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు. ఏలూరు త్రిటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సత్రం పాడుకు చెందిన కాపుదాసు భాగ్యరాజు మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో త్రీటౌన్ సీఐ వెంకటేశ్వరరావు సిబ్బందితో దాడిచేసి భాగ్యరాజును అరెస్టు చేశారు. ఎనిమిది మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఎక్స్‌కవేటర్ దగ్ధం



దగ్ధమైన ఎక్స్‌కవేటర్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 7: షార్ట్‌సర్క్యూట్ తో ఎక్స్‌కవేటర్ పూర్తిగా దగ్ధమైంది. ఏలూరు బీడీ కాలనీ ప్రాంతానికి చెందిన వెంట్రపాటి ముత్యాలరావుకు చెందిన ఎక్స్‌కవేటర్ ఆ ప్రాంతంలోనే పార్కింగ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం ఇంజన్‌లో వైర్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో మంటలు చెలరేగి యంత్రం పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందుకున్న ఏలూరు అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన వెళ్ళి మంటలను ఆర్పారు. సుమారు ఏడు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేశారు.

సంక్షిప్త సమాచారం..

- **ఏలూరు కలెక్టరేట్ :** పాలకొల్లు గ్రామానికి చెందిన బద్దా వాసు కుమారుడు శశాంక్ మెదడు సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చులకు సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష మంజూరు కావడంతో జేసీ డి.లావణ్యవేణి చెక్కును అందజేశారు.
- **పెదవేగి :** విద్యుత్ ఉపకేంద్రంలో వినియోగదారులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో పెదవేగి ఏడీ పి.శ్రీనివాస్ తెలిపారు. రైతులు హాజరు కావాలని ఆయన సూచించారు.
- **బుట్టాయగూడెం :** నక్కావారికుంట నుంచి కొందరు బీజేపీలో చేరగా మండల ప్రధాన కార్యదర్శి దెయ్యాల సీతారామాంజనేయులు కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. సోము హరినారాయణి, దొమ్మేటి లక్ష్మీ జనార్ధనరావు, ధర్ముల వెంకటేశ్వరావ పాల్గొన్నారు.
- బుట్టాయగూడెం పీఏసీఎస్ అధ్యక్షుడిగా కొమ్ముగూడెంకు చెందిన కలగర నాని బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కార్యదర్శి కరాటం నాగేంద్ర ఆయనచేత ప్రమాణస్వీకారం చేయించారు.
- రోడ్డుప్రమాదంలో మరణించిన వెంకటరెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు రూ.5 వేల ఆర్థికసాయం చేశారు. జడ్పీటీసీ ఎం.రామతులసి, ఆరేటి శాంతికుమారి పాల్గొన్నారు.
- గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లను అభివృద్ధి పరచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు బుట్టాయగూడెం ఎంపీపీ కారం శాంతి తెలిపారు. కోటనాగవరంలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు ఆమె భూమిపూజ చేశారు. వైస్ ఎంపిపి కె.వరలక్ష్మీ, సర్పంచ్ తెల్లం వెంకటలక్ష్మి పాల్గొన్నారు.
- **జీలుగుమిల్లి :** చిర్రివారిగూడెం సమీపంలో పేకాట స్థావరంపై ఎస్సై వి.చంద్రశేఖర్, సిబ్బంది దాడి చేశారు. ఐదుగురిని అదుపులోకి తీసుకుని రూ.5900 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.



కైకలూరు మంచినీటి చెరువుకు వెళ్లే తూము వద్ద పంటకాలువలో పేరుకుపోయిన వ్యర్థాలు



చెత్తాచెదారంతో నిండిన కైకలూరు పంటకాలువ



వైవాకలో కలుషితమైన తాగునీటి చెరువు



కాలువ నుంచి కలుషిత నీటిని చెరువులోకి తోడుతున్న ఇంజన్

ఈ కాల్వల నుంచే తాగునీరు?

తమ ఆరోగ్యంతో అధికారులు ఆడుకుంటున్నారని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కైకలూరు మండలంలో రేపో మాపో పంట కాల్వల్లోకి తాగునీటి చెర్వుల్లో నింపేందుకు నీటిని విడుదల చేస్తారు. అయితే ఆ పంట కాల్వలను ఇంతవరకు శుభ్రం చేయలేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతున్నాయి. మరి వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తున్న పంట కాల్వలను శుభ్రం చేయకుండా తాగునీటిని వదిలితే ఆ నీరు తాగునీటి చెర్వుల్లో నింపితే తమ ఆరోగ్యం ఏమవుతుందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇక ముదినేపల్లి రూరల్ మండలంలోని వైవాక గ్రామంలో రొయ్యల వ్యర్థాలు వదిలిన పంటకాల్వలో నీటినే చెర్వుల్లోకి నింపడంతో నీరు ఉప్పగా మారిందని గ్రామస్థులు గగ్గోలు పెడుతున్నారు.

» కాలుష్య కాసారంగా పంట కాల్వలు » శుభ్రతను మరచిన అధికారులు » ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు

కైకలూరు, ఫిబ్రవరి 7: అధికారుల అలసత్వమో... పాలకుల నిర్లక్ష్యమో... తెలియదు గాని పంట కాలువలు అధ్వానంగా మారాయి. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించవలసిన కాలువల నుంచి భరించలేని దుర్గంధం వెలువడుతోంది. ఇప్పటికే కైకలూరు మండలంలో మంచినీటి కొరత ఏర్పడింది. గ్రామాల్లో తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో కాలువలకు నీరు విడుదల చేసినా ఆ నీటిని మంచినీటి చెరువుల్లో నింపలేని పరిస్థితులు నెలకొన్నాయి. కైకలూరు పట్టణం, మండలంలోని ఆటపాక, గోనెపాడు, భుజబలపట్నం, పల్లెవాడ, ఆలపాడు గ్రామాలకు కైకలూరు పంటకాలువ ద్వారా నీరు సరఫరా చేయాల్సి ఉంది. అయితే పంటకాలువలు వ్యర్థాలు, నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు, చెత్తాచెదారంతో నిండిపోయాయి. వీటిలో కైకలూరు రాజీవ్ జలాశయానికి వెళ్లే పంటబోదె వద్ద కాలువ చెత్తాచెదారంతో నిండిపోయింది. కాలువలకు నీరు విడుదల చేసినా ఈ నీటిని మంచినీటి చెరువులో నింపితే ప్రజలు అనారోగ్యం పాలు కావాల్సిందే. కాలువలకు మంచినీరు విడుదల చేసే సమయంలోనైనా జలవనరుల శాఖ అధికారులు పంటకాలువలోని వ్యర్థాలను తొలగించి నీటిని విడుదల చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రొయ్యల చెర్వుల నీరు పంట కాల్వలోకి!

ముదినేపల్లి రూరల్: వైవాకలో తాగునీటి చెరువు నీరు కలుషితమవడంతో నీరు ఉప్పగా మారిందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంటకాలువ నుంచి తాగునీటి చెరువులోకి ఆయిల్ ఇంజిన్‌తో కలుషిత నీరు పంపింగ్ చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. రొయ్యల చెరువులోని నీరులోకి వెళ్ళడంతో నీరు కలుషితమవుతుందని పంచాయతీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. చెరువులో తాగునీరు ఉప్పునీరుగా మారిపోయిందని ఆవేదన చెందుతున్నారు. రొయ్యల చెరువులోని నీరు పంట కాలువలోకి రైతులు ఇష్టారాజ్యంగా తోడు వేయడంతో ఆ నీరు పంచాయతీ చెరువులోకి రావడంతో ఆ నీటిని ఉపయో గించాలంటే భయాందోళనకు గురవుతున్నామని ఆందోళన చెందుతున్నారు. పంచాయతీ అధికారులు ఇప్పటికైనా స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆశా వర్కర్ల గృహ నిర్బంధం



ఆశా వర్కర్లకు నోటీసులు అందజేస్తున్న హెచ్‌సీ రామారావు

ముదినేపల్లి, ఫిబ్రవరి 7 : తమ డిమాండ్ల పరిష్కారం కోసం ఆశావర్కర్లు గురువారం నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ముదినేపల్లి మండలం లోని ఆశా వర్కర్లను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. విజయవాడ వెళ్లేందుకు అనుమతులు లేవని ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ రామారావు ఆధ్వర్యంలో పోలీసులు మండలంలోని ఆశావర్కర్లకు బుధవారం సాయంత్రం నోటీసులు అందజేశారు. గురువారం మండలంలో నిఘా నిర్వహించి ఆశావర్కర్ల చలో విజయవాడ వెళ్లకుండా నిరోధించేందుకు చెక్ పోస్టులు ఏర్పాటు చేశారు.



ప్రిన్సిపాల్ బసవేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

ఆనందోత్సాహాల మధ్య ఫ్రెషర్స్ డే



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 7: నూజివీడు ఎమ్మార్ అప్పారావు కాలేజ్ ఫర్ పీజీ స్టడీస్‌లో ఫ్రెషర్స్ డే వేడుకలు ఆనందోత్సాహాల మధ్య సాగాయి. ఎంబీఏ, ఎంకాం, విభా గాలకు సంబంధించి ఫ్రెషర్స్ డే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎంవీ బసవేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఆయా విభాగాల్లో వస్తున్న నూతన సాంకేతికతలను పెంపొందించుకోవాలన్నారు. అప్పుడే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో నూతన భవనాలు అందుబాటులోకి వస్తాయని, విద్యార్థులకు మెరుగైన సేవలు అందుతాయని తెలిపారు. విభాగ సమన్వయకర్త సీహెచ్ ఈ. రాజారత్నం, అధ్యాపకులు కె.ప్రభాకర్‌రావు, సీహెచ్. నాగేశ్వరరావు, పి.తిరుమలరావు, అన్వర్ బాషా తదితరులు పాల్గొన్నారు. అనంతరం ప్రిన్సిపల్ బసవేశ్వరరావును ఉపాధ్యాయ బృందం సత్కరించింది.

అజరయ్యపేటలో ఆరోగ్య సురక్ష

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 7: నూజివీడు పట్టణం అజరయ్యపేటలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నూజివీడు మున్సిపల్ వైస్ చైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వార్డు కౌన్సిలర్ కళ్ళేపల్లి ప్రియాంక ప్రారంభించగా, అర్బన్ పీహెచ్‌సీ వైద్య బృందం వివిధ విభాగాల్లో వైద్యపరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

అంతర్గత రహదారికి మోక్షం



ముసునూరు, ఫిబ్రవరి 7: ముసునూరులో పొలాల్లోకి వెళ్ళే అంతర్గత రహదారి ఎట్టకేలకు ఎంపీటీసీ నిధులతో అభివృద్ధి చేస్తున్నారు. ఎంపీటీసీ-2 తులిమెల్లి కృష్ణకుమారికి కేటాయించిన రూ.3 లక్షల నిధులతో బుధవారం అభివృద్ధి పనులు చేపట్టారు. ఎక్స్‌కవేటర్‌తో ఈ రహదారికి ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు. ఎస్ఎస్ఎన్ పబ్లిక్ స్కూల్ నుంచి కిలోమీటరు పొడవునా ఈ రహదారికి డ్రైనేజీ ఏర్పాటు, గ్రావెల్‌తో అభివృద్ధి చేసే పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఏళ్ళతరబడి అధ్వానంగా ఉన్న ఈ రహదారిని అభివృద్ధి చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

» పట్టించుకోని ట్రాన్స్‌కో అధికారులు



ముసునూరు, ఫిబ్రవరి 7: ముసునూరు తహసీల్దార్ కార్యాలయ సమీపంలోని విద్యుత్ స్తంభం ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉంది. పలుమార్లు ట్రాన్స్‌కో అధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్ళినా పట్టించుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదకరంగా ఉన్న ఈ విద్యుత్ స్తంభం నేలకొరిగితే మిగిలిన స్తంభాలు సైతం విరిగిపోయే ప్రమాదం ఉందని, ఈ విద్యుత్ లైన్ పక్కనే బాలికల హాస్టల్, ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయని, నిత్యం ఈ రహదారి జనంతో రద్దీగా ఉంటుందని, స్తంభం పూర్తిగా విరిగిపోతే షార్ట్‌సర్క్యూట్ వల్ల పెనుప్రమా దం సంభ విస్తుందని, తక్షణం దీనిని పునరుద్ధరించాలని స్థానికులు కోరుతు న్నారు. ఈ సమస్యపై ట్రాన్స్‌కో ఏఈ హేమసుందర్‌కుమార్‌ను వివరణ కోరగా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని పునరుద్ధరిస్తామని తెలిపారు.



భవిష్యత్‌కు గ్యారెంటీలో మాట్లాడుతున్న ముద్దరబోయిన

'టీడీపీలోనే బీసీలకు పెద్దపీట'

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 7: టీడీపీతోనే బీసీలకు రాజ్యాధికారం వచ్చిందని, దొరల పెత్తనం కొనసాగుతున్న కాలంలో ఎన్టీఆర్ పార్టీని స్థాపించి బడుగు, బలహీన వర్గాలను రాజకీయంగా ప్రోత్సహించారని టీడీపీ నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆగిరిపల్లి మండలం సింహాద్రి అప్పారావు పేట (ఎస్‌ఏ పేట) గ్రామంలో బుధవారం బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముద్దరబోయిన ఇంటింటికి వెళ్లి మినీ మేనిఫెస్టోలోని పథకాలు ప్రజలకు వివరించారు. నూజివీడు నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఓటమి పాలైనా అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేశానన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక టీడీపీ చేపట్టిన అభివృద్ధి పనులు మధ్యలోనే నిలిపివేశారన్నారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కొండా మంగయ్య, ఉమ్మడి కృష్ణాజిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షులు చిట్నేని శివరామకృష్ణ, మల్లవల్లి కోటేశ్వరరావు, ఒరుగు పంగిడయ్య, పామర్తి రామకోటేశ్వరరావు, నీలపాల రమేష్, జన్యావుల రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి అంబేడ్కర్‌కు ఘన నివాళి



మండవల్లి, ఫిబ్రవరి 7: త్యాగానికి ప్రతిరూపం రమాబాయి అంబేడ్కర్ అని మండవల్లి అంబేడ్కర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, ఇండియన్ బ్యాంక్ మండవల్లి శాఖ మేనేజర్ బొంతు దుర్గారావు, ప్ర.ప.ఐక్యవేదిక మండవల్లి శాఖ అధ్యక్షుడు టి అప్పారావు, జైభీమ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు వట్టిప్రోలు సుధీర్ అన్నారు. అంబేడ్కర్ సతీమణి రమాబాయి 127 జయంతిని మండవల్లి గ్రంథాలయం వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయ అధికారిణి షేక్ పర్వీన్, భాస్కరరావు, దుర్గారావు, అప్పారావు, సుధీర్ రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ త్యాగానికి నిలువెత్తు నిదర్శనం రమాబాయి అని కొనియాడారు.

నేడు కామినేని ఆత్మీయ సమావేశాలు

కైకలూరు, ఫిబ్రవరి 7: మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ గురువారం కైకలూరు మండలం నరసాయిపాలెం, ఆలపాడు గ్రామాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించనున్నారు. సాయంత్రం 4 గంటలకు నరసాయిపాలెం, 5 గంటలకు ఆలపాడు గ్రామాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు.

అంబేడ్కర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శాంతరాజు



మండవల్లి, ఫిబ్రవరి 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి కమిటీ నూతన అధ్యక్షుడిగా కొరపాటి శాంతరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండవల్లిలో బుధవారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా పాగోల్లు అభిష్, బేతపూడి తంబి, సెక్రటరీగా కొండపల్లి రవి, జాయింట్ సెక్రటరీగా వట్టిప్రోలు సుధీర్, ట్రెజరర్‌గా దాకరపు వినోద్, ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా సభ్యులుగా మెండ రాజేష్ తదితరులు ఎన్నికయ్యారు.

సచివాలయాల్లో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు

ముదినేపల్లి, ఫిబ్రవరి 7 : జగనన్న కాలనీల్లోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ ముదినేపల్లి మండలంలో ప్రారంభమైంది. మండలంలో ఇళ్ల స్థలాల పట్టాలు పొందిన సుమారు 2260 మంది మహిళలకు ఆయా గ్రామ సచివాలయాల్లో స్థలాలను రిజిస్ట్రేషన్ కాంపిటెంట్ అథారిటీ అయిన పంచాయతీ కార్యదర్శులు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. రెవెన్యూ పరంగా వీఆర్వోలు, సచివాలయాల సిబ్బంది ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు. రెండు రోజులుగా మండలంలో సుమారు 30 శాతం మంది లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. పెదగొన్నూరు గ్రామ సచివాలయంలో బుధవారం తహసీల్దార్ ఎస్.ఎల్.ఎన్.కుమారి రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పరిశీలించారు. గ్రామంలో 445 మందికి రిజిస్ట్రేషన్లు చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకు 188 మందికి పూర్తయినట్టు వీఆర్వో ఏడుకొండలు తహసీల్దార్‌కు తెలిపారు.





ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కామినేని

'వైసీపీ పాలనలో దోపిడీ, దౌర్జన్యాలే'

మండవల్లి, ఫిబ్రవరి 7: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కంటే నేతల దోపిడీ, దౌర్జన్యాలు పెట్రేగిపోయాయని, రానున్న ఎన్నికల్లో ప్రజలు వైసీపీని తరిమికొట్టాలని మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మండలంలోని అయ్యవారిరుద్రవరం, భైరవపట్నం గ్రామాల్లో బుధవారం జరిగిన ఆత్మీయ సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ పేదవాళ్లకు పెత్తందారులకు యుద్ధం అని సీఎం జగన్ అంటున్నారని దేశంలోని రాజకీయ నాయకుల్లో జగన్‌కంటే డబ్బున్న నేతలు ఎవరూ లేరని, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు జగన్ జిమ్మిక్కులు చేస్తున్నాడన్నారు. రాజధాని లేని రాష్ట్రం మనదేనని పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గాలికొదిలేసిన ఘనత జగన్‌దేనన్నారు. కరెంటు బిల్లులు దారుణంగా పెంచారని, నియోజకవర్గంలో వైసీపీ నేతల అరాచకాలు పెరిగిపోయాయని మండిపడ్డారు. పార్టీ మండవల్లి మండల అధ్యక్షుడు నార గాని నాగేశ్వరరావు, కైకలూరు నియోజకవర్గ తెలుగు రైతు నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు, టీడీపీ నాయకులు చాపరాల దుర్గాప్రసాద్, బొల్లంపల్లి కృష్ణా రావు, ఎస్. బాబి, జనసేన నాయకులు కొల్లి బాబి, కేవీఎస్ఎం నాయుడు, రుద్ర వరం మాజీ సర్పంచ్ వెంకయ్య, కె. కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలించిన తహసీల్దార్



ముదినేపల్లి, ఫిబ్రవరి 7 : కలెక్టర్ ఆదేశాలతో ముదినేపల్లి మండలంలోని పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ ఎస్.లక్ష్మీనరసకుమారి బుధవారం తనిఖీ చేశారు. మండలంలోని పెదగొన్నూరు, ఉప్పరగూడెం, ఊటుకూరు తదితర గ్రామాల్లోని పోలింగ్ బూత్‌లను పరిశీలించి ఎన్నికల నిర్వహణకు చేయాల్సిన ఏర్పాట్లను ఆమె బీఎల్‌ఓలకు సూచించారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై నివేదిక ఇవ్వాలని వీఆర్వోలకు తెలిపారు. ఆర్ఐ శివకుమార్ పాల్గొన్నారు.



టెన్త్ విద్యార్థులకు టాలెంట్ టెస్ట్

కలిదిండి, ఫిబ్రవరి 7 : మండలంలోని టెన్త్ విద్యార్థులకు ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్‌లో బుధవారం టాలెంట్ పరీక్ష నిర్వహించారు. పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడే విధంగా నిర్వహించిన ఈ పరీక్షలో 8 మంది విద్యార్థులు తమ ప్రతిభను కనబర్చారని ఎంఈవో ప్రభాకర్ బాబు తెలిపారు. వారికి ప్రోత్సాహక బహుమతులు అందించామన్నారు. కలిదిండి, గుర్వాయిపాలెం, ఆరుతెగలపాడు, కొండంగి, చిన్నతాడినాడ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శరవేగంగా అంకమ్మ ఆలయ నిర్మాణం



ముసునూరు, ఫిబ్రవరి 7: వేల్పుచర్లలో అంకమ్మ నూతన ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ నెల 15న అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని ఆలయ కమిటీ నిర్ణయించింది. దీంతో ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నారు. ఆలయ నిర్మాణానికి స్థానికులంతా తమవంతు సహాయ సహకారాలను అందిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

చేప ధర పతనం

» భారీగా తగ్గిన తెల్లచేపల ధర » ఫంగస్‌దీ అదేదారి

» తగ్గిన ఎగుమతులు » నష్టాల ఊబిలో ఆక్వా రైతులు

కలిదిండి, ఫిబ్రవరి 7 : చేప ధర పతనమైంది. ఇంతకుముందు తెల్లచేప కిలో రూ.120 ఉండగా, ఒక్కసారిగా రూ.102కి పడిపోయింది. దీంతో చేపల పెంపకందార్లు ఆందోళన చెందుతున్నారు. జిల్లా నుంచి ప్రతిరోజు సుమారు 400 నుంచి 600 లారీల చేపలు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు అయ్యేవి. ప్రస్తుతం 200 నుంచి 300 లారీలు మాత్రమే ఎగుమతి అవుతున్నాయి. అస్సోం, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లో చేపల కొనుగోళ్లు నిలుపుదల చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేపల మేత డీవోబీ తవుడు 10 టన్నులు లక్షా 80 వేలు పలుకుతుంది. లీజు ఎకరాకు లక్ష వరకు ఉంది. ఖర్చు పెరిగి ఎగుమతులు లేక ధర పడిపోవటంతో రైతులు తల్లడిల్లుతున్నారు.

ఫంగస్‌దీ అదే దారి..

ఫంగస్ చేపల సాగు తీవ్ర సంక్షోభంలో పడింది. ఫంగస్ సాగు చేసిన రైతులు భారీగా నష్టపోతున్నారు. ఇంతకు ముందు ఫంగస్ కిలో రూ.95 పలకగా ప్రస్తుతం రూ.65కి పడిపోయింది. కిలో ఫంగస్ పెరుగుదలకు రూ.80 ఖర్చు అవుతుందని మేత భారం ఎక్కువైందని, కిలో రూ.65కి అమ్మితే తీవ్రంగా నష్టాల్లో మునిగిపోతామని రైతులు వాపోతున్నారు. పలు రాష్ట్రాల్లో చేపల మార్కెట్‌లను మూసి వేయటంతో చేపల ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోయినట్టు సమాచారం. ఫంగస్ చేపల రైతులు, ట్రేడర్లు, ఫీడ్ కంపెనీ యజమానులతో ప్రభుత్వం సమావేశం నిర్వహించాలని, కిలో ధర కనీసం రూ.80 కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

గిట్టుబాటు ధర కల్పించాలి



తెల్ల చేప ధర కిలో రూ.120, ఫంగస్ రూ.80 ఉండే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మేత ధరలు తగ్గించాలి. తెల్ల చేపల ఎగుమతులు తగ్గటంతో వ్యాపారులు చేపల కొనుగోలుకు ఆసక్తి చూపటం లేదు. దీంతో చేపలను ఏ విధంగా అమ్ముకోవాలో తెలియటం లేదు. తెల్ల చేపలు, ఫంగస్‌లను ఈశాన్య రాష్ట్రాలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

-అక్కల బోసు, ఆక్వా రైతు



చాట్రాయిలో నులిపురుగుల నివారణ పోస్టర్ల ఆవిష్కరణ

నులి పురుగులను నిర్మూలించాలి

చాట్రాయి, ఫిబ్రవరి 7: ఫిబ్రవరి 9న జరిగే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు, అంగన్వాడీలు, వైద్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి విజయవంతం చెయ్యాలని ఎంపీడీవో మంగాకుమారి, పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసుల రెడ్డి కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన అవగాహన సమావేశంలో అధికారులు మాట్లాడుతూ 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించటం వల్ల కడుపులో నులిపురుగులు చనిపోయి కడుపు నొప్పి, రక్తహీనత ఇతర వ్యాధులు దూరం అవుతాయన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీలు, అంగన్వాడీ కేంద్రాల్లో 9వతేదీన మాత్రలు పంపిణీ జరుగుతుందని తల్లిదండ్రులు అవగాహనతో ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎంలు అంగన్వాడీ కార్యకర్తలకు, ఏఎన్‌యంలకు మాత్రలు పంపిణీ చేశారు. సీహెచ్‌వో రమణ మండల పరిషత్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సెలవుపై పెదపాలపర్రు హెచ్ఎం

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 7: మండలంలోని పెదపాలపర్రు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం శాంతకుమారి సెలవుపై వెళ్ళారు. ఆమె విద్యార్థులను దూషిస్తోందని, ఇతర సమస్యలపై తల్లిదండ్రుల నుంచి జిల్లా కలెక్టర్ ఫిర్యాదు అందడంతో కలెక్టర్ డీఈవోతో విచారణ చేయించారు. నివేదికను డీఈవో ఆర్డీకి అందజేశారు. ఈ నేపథ్యంలో శాంతకుమారి సెలవుపై వెళ్లారు.

మూడున్నర కిలోల కణితి తొలగింపు



కణితిని చూపుతున్న వైద్య బృందం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 7: నూజివీడు అమెరికన్ ఆస్పత్రిలో మరో అరుదైన శస్త్రచికిత్స జరిగింది. నూజివీడు పట్టణానికి చెందిన తీరా వాణి పొట్టలో మూడున్నర కిలోల కణితి ఏర్పడటంతో ఆమె తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంది. ఈ క్రమంలో ఆమె ఆసుపత్రికి రాగా ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎడ్విన్‌రాజ్, గైనకాలజిస్ట్ చీఫ్ మెడికల్ ఆఫీసర్ సోనియా బేబీ జాన్ వైద్య పరీక్షలు చేసి ఆమె పొట్టలో కణితి ఉందని గుర్తించారు. క్లిష్టమైన శస్త్రచికిత్స చేసి ఆమెకు ప్రాణాపాయాన్ని తప్పించారు. ఆపరేషన్ విజయవంతం కావడంతో బాధితురాలి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

పెండింగ్ పనులను తక్షణం పూర్తి చేయండి



ముసునూరు, ఫిబ్రవరి 7: ఉపాధిలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని ఎంపీడీవో సీహెచ్ పద్మావతీదేవి ఆదేశించారు. బుధవారం ఉపాధి కార్యాలయంలో మండల వ్యాప్తంగా జరుగుతున్న ఉపాధి పనులపై ఆమె సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గ్రామాల వారీగా జరుగుతున్న పనుల స్థితిగతులపై ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లను అడిగి తెలుసుకున్నారు. రెండు నెలల్లో పెండింగ్ పనులన్నీ పూర్తిచేయాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే 2024-25 సంవత్సరానికి గ్రామాల్లో చేపట్టే ఉపాధి పనుల ప్రణాళికలను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఏపీవో రోజ్‌లీల, ఈసీ జయప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఇన్నర్ వీల్ క్లబ్ ఆధ్వర్యంలో నర్సులకు సత్కారం

నర్సులకు సత్కారం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 7: ఇన్నర్‌వీల్ నూజివీడు మ్యాంగో టౌన్ ఆధ్వర్యంలో నర్సులను సన్మానించారు. నూజివీడు రోటరీ క్లబ్ హాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహించగా, క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ శ్రీదేవి, నూజివీడు మ్యాంగో టౌన్ అధ్యక్షురాలు కె.అరుణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లబ్ స్థాపించి వందేళ్ల పూర్తయిన సందర్భంగా 100 మంది నర్సులను సన్మానించినట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి విభుప్రియ, చారిటి అధ్యక్షురాలు ఆర్.మాలతి, క్లబ్ సభ్యులు వి.సంధ్య, లలిత, తులసి, మానస, నాగమణి, సునీత, హేమ తదితరులు పాల్గొన్నారు.

ఈదరలో ముగిసిన వాలీబాల్ శిక్షణ



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 7: ఆడుదాం ఆంధ్రా పోటీల్లో భాగంగా ఈదర జడ్పీ హైస్కూల్‌లో రెండురోజుల వాలీబాల్ శిక్షణ శిబిరం ముగిసింది. ఈ నెల 9న విశాఖలో జరిగే ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో విజేతగా నిలవాలని ఉప విద్యాశాఖాధికారి సేవ్యా క్రీడాకారులకు సూచించారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన ఈదర జట్టుకు ప్రైజ్‌మనీ వారి ఖాతాల్లో జమచేశామన్నారు.